ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

శుక్రవారం 2 ఫిబ్రవరి 2024





బాపట్ల జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం జగన్మోహనరెడ్డికి మిచౌంగ్ తుఫాన్ మిగిల్చిన నష్టాన్ని ఫొటోల ద్వారా వివరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా(ఫైల్ ఫొటో)

జగనన్న హామీ.. హుళక్కే!

- అన్నదాతలకు ఇంకా అందని మిచౌంగ్ తుఫాన్ పరిహారం
- సంక్రాంతిలోపే ఇస్తామన్న సీఎం మాటలు నీటిమూటలే
- ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రైతుల ఎదురుచూపులు
- పంట నష్టం నివేదికల్లోనూ భారీగా కోత

బాపట్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మిచౌంగ్ తుఫాన్ ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఉన్న రైతుల్ని అతలాకుతలం చేసి ఇప్పటికే నెలలు గడచిపోయింది. గతేడాది డిసెంబరు మొదటి వారంలో విరుచుకుపడిన తుఫాన్ ధాటికి అన్నదాతలు చిగురుటాకులా వణికిపోయారు. విపత్తు సృష్టించిన నష్టానికి ప్రభుత్వ నిర్లక్ష్యం కూడా తోడవడంతో నష్టం తీవ్రత భారీగా పెరగడంతో అన్నదాత గుండె చెరువైంది. తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను పరామర్శించడానికి గతేడాది డిసెంబరు 8న సీఎం జగన్మోహనరెడ్డి జిల్లా పరిధిలోని కర్లపాలెం మండలం బుద్దాం, పాతనందాయపాలేనికి వచ్చారు. అక్కడ దెబ్బతిన్న వరిపైరును పరిశీలించడంతో పాటు రైతులనుద్దేశించి మాట్లాడారు. సంక్రాంతి పండగలోపే నష్టపోయిన అన్నదాతలందరికీ పరిహారం జమచేస్తామని గొప్పగా ప్రకటించారు. పండగ వచ్చి పోయింది.. కానీ రైతాంగం ఖాతాల్లో డబ్బులు మాత్రం జమ అవ్వలేదు.

నివేదికలతో సరి...

మిచౌంగ్ తుఫాన్‌తో నష్టపోయిన పంటల వివరాలతో నివేదికను గతేడాది డిసెంబరు చివరికి వ్యవసాయశాఖ ప్రభుత్వానికి నివేదించింది. ఉద్యాన పంటలతో కలిపి జిల్లావ్యాప్తంగా మొత్తం 63,301 హెక్టార్లలో పంటకు మిచౌంగ్ తుఫాన్ వల్ల నష్టం వాటిల్లిందని, 92,220 మంది రైతులకు పరిహారం అందించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ జాబితా ప్రభుత్వానికి పంపించి కూడా రెండు వారాలు దాటింది. పైగా అన్నదాతలకు సంక్రాంతిలోపే డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయని కూడా చెప్పారు.

నష్టం నివేదికల్లోనూ భారీగా కోత..

మిచౌంగ్ తుఫాన్ విరుచుకుపడినప్పుడు వ్యవసాయశాఖ రూపొందించిన ప్రాథమిక నివేదికల ప్రకారం బాపట్ల జిల్లాలో 93,244 హెక్టార్లకు నష్టం వాటిల్లినట్లు తేల్చారు. ఇదే పల్నాడు జిల్లాకు వచ్చేసరికి ఇది 9,370 ఎకరాలుగా తేల్చారు. ఇక గుంటూరు జిల్లాకు 1,04,790 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు అప్పట్లో ప్రాథమికంగా వ్యవసాయశాఖ నిర్ధారణకు వచ్చింది. నష్టం వివరాలను సోషల్ ఆడిట్ కోసం ఆయా రైతుభరోసా కేంద్రాల్లో ఉంచినప్పుడు బాపట్ల జిల్లాలో సంఖ్య 78,173 హెక్టార్లకు తగ్గిపోగా చివరికి ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో అది కాస్తా 63,301 హెక్టార్లకే పరిమితమైంది. ఇక పల్నాడు, గుంటూరు జిల్లాల్లో కూడా తుది జాబితాలో 50 శాతం విస్తీర్ణానికే చోటు దక్కింది.

ఉదారంగా ఆదుకుంటాం..

సీఎం జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు నష్టపోయిన రైతాంగాన్ని ఉదారంగా ఆదుకుంటామనే మాటలు చెప్పారు. నష్టం నివేదికల్లో ఎక్కడా ఉదారత కనబడకపోగా అడ్డగోలుగా దెబ్బతిన్న విస్తీర్ణం తగ్గించడానికే ప్రయత్నించారు. ప్రాథమిక నివేదికలకు, తుది జాబితాకు పొంతన లేకపోవడమే దీనికి నిదర్శనం. పైగా సోషల్ ఆడిట్ పేరుతో తొలుత రూపొందించిన పంటనష్టం జాబితా వివరాలను ఆయా రైతుభరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచారు. విచిత్రంగా తుది నివేదికలో సోషల్ ఆడిట్‌లో ఉంచిన జాబితా కూడా తగ్గిపోయింది.

ఇచ్చే కాస్తా ఎప్పుడిస్తారు..

దాదాపు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా రూ.500 కోట్ల నష్టాన్ని అన్నదాతలకు మిగిల్చిందని అప్పట్లో అంచనా వేశారు. ఒక్క బాపట్ల జిల్లాలోనే ఈ నష్టం రూ.400 కోట్ల వరకు ఉంటుందని లెక్కకట్టారు. తీరా తుది జాబితాకు వచ్చేసరికి ఒక్క బాపట్ల జిల్లాలో రూ.101.40 కోట్ల నష్టమే జరిగినట్లు ప్రభుత్వానికి నివేదించడంతో అవాక్కవడం రైతాంగం వంతైంది. ఇచ్చే ఆ కాస్తా సాయంపై కూడా ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేయడాన్ని అన్నదాతలు తప్పుబడుతున్నారు. సంక్రాంతికి పరిహారం అందిస్తామని జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి చెప్పిన మాటలకే ఇప్పటివరకు మోక్షం కలగలేదని రైతులు వాపోతున్నారు.

పరిహారం అందించడంలో కూడా రాజకీయమా..

వాస్తవానికి సంక్రాంతికి పరిహారం రైతుల ఖాతాల్లో జమ చేయకుండా ఉండడంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. సమీప దూరంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ఫిబ్రవరి చివరి వరకు కాలయాపన చేసి అప్పుడు అన్నదాతల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేస్తే రాజకీయంగా తమకు ఉపయోగం ఉంటుందనే ఆలోచనలో పాలకపార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. దీనిని బలపర్చే విధంగానే పరిహారం విషయంలో వ్యవసాయశాఖ సమాధానం ఉంటోంది. నివేదికలను ప్రభుత్వానికి సమర్పించడంతో తమ పని అయిపోయిందని పరిహారం అందించే విషయంలో ప్రస్తుతానికి కదలికలేమి కనబడడం లేదని యంత్రాంగం సమాధానమివ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది.

తాజాగా విడుదలైన ఓటర్ల తుది జాబితాలో అక్రమాలు, అవకతవకలు యథాతథంగా కొనసాగుతూనే వున్నాయి. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లా? అధికారుల నిర్లక్ష్యమా? అధికార పార్టీ సేవలో తరిస్తున్న అధికారుల అనైతిక వైఖరా? కారణం ఏదన్నా.. తుది ఓటర్ల జాబితాలో కూడా తప్పుల తడకగానే విడుదల అయింది. ఓటర్ల జాబితాపై వెల్లువెత్తిన ఫిర్యాదుల్లో ఒకటి అరా ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని వాటిని మాత్రమే సరిచేసిన అధికారులు మిగిలినవాటిని అలానే వదిలేశారు. గుంటూరు నగరంలో కొత్త, పాత డోర్ నెంబర్లతో విడుదలైన ఓట్ల జాబితాలో నెలకొన్న గందరగోళం తుది జాబితాలో కూడా యథాతథంగా కొనసాగింది. కొత్త డోర్ నెంబర్లతో జాబితాను రూపొందించి, అక్రమాలను అరికట్టాలన్న ప్రతిపక్ష పార్టీల వేడుకోళ్లను పక్కనపెట్టి పాత, కొత్త డోర్ నెంబర్లతోనే తుది జాబితాను విడుదల చేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు.





ఓటర్ల జాబితాలో కనిపిస్తున్న డబుల్ ఎంట్రీలు



ఓటర్ల జాబితాలో ప్రత్యక్షమైన మృతుల ఓట్లు

ఆ ఓట్లకు.. మళ్లీ చోటు!

- ఓటర్ల తుది జాబితాలో తప్పులు యథాతథం
- మళ్లీ ప్రత్యక్షమైన డబుల్ ఎంట్రీలు
- ఆందోళన కలిగిస్తున్న మృతుల ఓట్లు
- పాత, కొత్త డోర్ నెంబర్లతో గందరగోళంగా జాబితా
- సరిచేయకుండా చేతులు దులుపుకున్న అధికారులు
- గుంటూరు ఓటర్ల తనిఖీలో వలంటీర్ల హడావుడి

గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని బూత్ నెంబరు పరిధిలో షేక్ గౌసియా బేగం పేరుతో, సయ్యద్ నబీ పేరుతో రెండేసి ఓట్లు వున్నాయి. ఇలా ఒకే పేరుతో వున్న రెండేసి ఓట్లపై గతంలోనే టీడీపీ నాయకులు ఫిర్యాదులు చేశారు. కానీ అధికారులు మాత్రం వాటిని పట్టించుకోలేదు. దీంతో అవి తుది జాబితాలో తిరిగి ప్రత్యక్షమయ్యాయి. కోబాల్ట్‌పేటకు చెందిన దాసరి జయమ్మ కొన్నాళ్ల క్రితం చనిపోయింది. ఆమె ఓటు ముసాయిదా జాబితాలో వచ్చింది. దానిపై నియోజకవర్గ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. కానీ తుది జాబితాలో ఆ పేరు యథాతథంగా వచ్చింది. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. ఒక్కో నియోజకవర్గంలో చనిపోయినవారి పేరుతో కొనసాగుతున్న ఓట్లు వేలల్లో వున్నాయి.

గుంటూరు 'పశ్చిమ' టార్గెట్..

తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా వున్న గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని అధికారపార్టీ టార్గెట్ చేసింది. ఆ నియోజకవర్గంలో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో ఏడాది కాలంగా చేయని అక్రమాలు లేవు. ఒకే డోరు నెంబరుతో వందల ఓట్లను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఓటర్ల జాబితాపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ అనుకూలుర ఓట్లు పెద్దసంఖ్యలో చేర్పించారని, ఒకరి పేరుతోనే రెండూ అంతకంటే ఎక్కువ ఓట్లు వున్నాయని, మృతుల ఓట్లు భారీసంఖ్యలో ఉన్నాయని ఫిర్యాదులు అందాయి. దీనికి తోడు పాత, కొత్త డోర్ నెంబర్లతో ఓటర్ల జాబితా తప్పుల తడకగా వుందని అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. కానీ అధికారులు ఒకటి రెండు ముఖ్యమైన ఫిర్యాదులను పరిష్కరించి వదిలేశారు. ఇప్పటికీ ఆ నియోజకవర్గం పరిధిలో డబుల్ ఓట్లు, మృతుల ఓట్లు లెక్కకు మించి వున్నాయి. ఒక్కో పోలింగ్ బూత్ పరిధిలో 10 నుంచి 15 వరకూ మృతుల ఓట్లు, డబుల్ ఎంట్రీలు వున్నట్లు వెలుగులోకి వస్తోంది. మొత్తంగా నియోజకవర్గం పరిధిలో 282 బూతుల్లో దాదాపు 5 వేల వరకూ మృతుల, డబుల్ ఎంట్రీ ఓట్లు వుంటాయని ప్రతిపక్ష పార్టీలు అంచనా వేస్తున్నాయి. వాటిపై కసరత్తు చేస్తున్నాయి.

మృతుల ఓట్ల తొలగింపు సవాలు...


గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మృతుల ఓట్ల తొలగింపు సవాలుగా మారింది. మృతుల ఓట్లను తొలగించాలని నియోజకవర్గ అధికారులకు ఫిర్యాదు చేసిన పలువురు నేతలు చివరకు జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లారు. అయినప్పటికీ ఇటీవల విడుదలైన తుది జాబితాలో మృతుల ఓట్లు దర్శనమిచ్చాయి. తాజా లెక్కల ప్రకారం 3 వేల వరకూ మృతుల ఓట్లు ఉన్నట్లు అంచనాకి వచ్చారు. మొత్తంగా జిల్లాలో 10వేలకు పైగా మృతుల ఓట్లు వున్నాయని, అవి యథాతథంగా తుదిజాబితాలో కూడా కనిపిస్తున్నాయని ప్రతిపక్షాల నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఓట్లతో అధికారపార్టీ దొంగ ఓట్ల కుట్రలను కొనసాగిస్తుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

వలంటీర్ల హడావుడి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వలంటీర్ల హడావుడి కనిపిస్తోంది. ఓటర్ల జాబితా, ఎన్నికల అంశాల్లో వలంటీర్ల జోక్యం ఉండరాదని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు ఆదేశించినా ప్రభుత్వం, అధికారపార్టీ వాటిని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వలంటీర్లను ఇంటింటికీ తిప్పి ఓటరు వెరిఫికేషన్, ఓటు నమోదు, తదితర పనులకు వారినే వినియోగిస్తున్న ఘటనలు అనేకం కనిపిస్తున్నాయి.

షెల్టర్ లెస్ చిరునామాతోనూ ఓటర్లు

గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో షెల్టర్ లెస్(నివాస రహిత) డోర్ నెంబరుతోనూ ఓటర్ల చేర్పులు జరిగాయి. ఇవి ఎస్‌ఎస్‌ఆర్ - 2024లో భాగంగా జరిగాయా... గత కొన్నేళ్ల క్రితమే నమోదయ్యాయా అన్న దానిపై స్పష్టత లేదు. బీఎల్‌వోలు కేవలం డోర్ టూ డోర్ పరిశీలన మాత్రమే జరిపి ఎవరికైనా ఓటుహక్కు లేకపోతే వారితో ఫారం-6 పెట్టించారు. అంతే తప్పా నివాసం లేకుండా ఉన్న వారి జోలికి అసలు పోలేదు. అయినప్పటికీ పలు పోలింగ్ బూత్‌లలో ఓటర్ల ఇంటి నెంబరు వద్ద షెల్టర్ లెస్ అని పొందుపరిచారు. వీటిపై ప్రతిపక్ష పార్టీలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి.



Name : UPPARAPALLI SRINIVASA REDDY
Fathers Name: UPPARAPALLI VENKATESWARA REDDY
House Number : SHELTER LESS
Age : 47 Gender : Male

Photo Available

షెల్టర్ లెస్ డోర్ నెంబరుతో ఓటరు

షెల్టర్‌లెస్ వారికి కూడా ఓటుహక్కు కల్పించే నిబంధన ఉన్నది. అయితే ఎక్కడైతే వారికి ఓటుహక్కు కల్పించారో ఆ పరిసరాల్లో సంబంధిత ఓటర్లు ఉంటున్నారా, లేదా అనేది బీఎల్‌వోలు క్షుణ్ణంగా పరిశీలన చేయాల్సి ఉన్నది. నివాసరహిత ఓటర్లు పొట్టకూటి కోసం వేరే ప్రాంతాలకు వెళ్లిపోతుంటారు. అలాంటప్పుడు స్థానికంగా ఉండకపోతే వారి ఓటుని ఫారం-7 పెట్టి తొలగించాలి. ఆ దిశగా ఎలాంటి చర్యలు ఈ దఫా ఎస్‌ఎస్‌ఆర్‌లో చేపట్టలేదు. ఇప్పుడు తుది ఓటర్ల జాబితాని విడుదల చేసిన తర్వాత కొంతమంది ఓటర్ల ఇంటి నెంబర్ల వద్ద షెల్టర్ లెస్ అని పేర్కొన్నారు. దీని వలన ఆయా ఓటరు ఎక్కడున్నారనే దానిని తెలుసుకోవడం కూడా కష్టమే.

కాగా 18 ఏళ్ల వయస్సు దాటి గతంలో ఓటు హక్కు పొందలేక గత ఎస్‌ఎస్‌ఆర్‌లో దరఖాస్తు చేసుకొన్న వారికి ఈఆర్‌వోలు ఓటుహక్కు కల్పించలేదు. అదేమంటే ఇప్పటివరకు ఎందుకు ఓటరుగా నమోదు కాలేదో తమకు లిఖిత పూర్వకంగా ఇవ్వాలని, దానినే తాము ఈసీకి పంపుతామన్నారు. అలా అండర్‌టేకింగ్ ఇచ్చిన వారికి కూడా ఓటుహక్కుని ఈఆర్‌వోలు జిల్లాలో పలుచోట్ల కల్పించలేదు.

ఓటు.. డిలీట్!

- ఎన్నో ఏళ్లుగా ఉన్న ఓటు తొలగింపు
- ఒకే కుటుంబంలో ఓట్లన్నీ తీసేసి...
- గ్రామంలో నివాసం ఉన్నా ఓటు లేనట్టేనట
- ముగ్గురున్న కుటుంబంలోకి మరో కొత్త ఓటు
- ఎవరిదోకూడా తెలియని విచిత్రం

తెనాలి, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): బతికున్నవారి ఓట్లు మరణించినట్టు, చనిపోయినవారి ఓట్లు ఉన్నట్లు అనేక చిత్రాలకు చిట్టాగా మారిన మన ఓటర్ల జాబితాలో మరికొన్ని వి'సి'త్రాలు' కనిపిస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఓటున్న కుటుంబాలకు కుటుంబాల ఓట్లు ఏ కారణం లేకుండానే డిలీట్ కొట్టేయటం ఒక విచిత్రమైతే, అసలు ఎవరో తెలియని ఓట్లు కొన్ని కుటుంబాల జాబితాలో కలిపేయటం మరో గందరగోళానికి తెరతీస్తోంది.

తెనాలి నియోజకవర్గంలో పెదరావూరు గ్రామంలో నివాసముంటున్న కందేపు హరిప్రసాదరావు, పద్మలత దంపతులు, వారి పిల్లల ఓట్లు కొత్త జాబితాలో కనిపిస్తున్నా, వాటిపై డిలీట్ అని కొట్టి ఉన్నాయి. ఇదే తరహాలో ఇదే గ్రామంలో మరికొన్ని కుటుంబాల ఓట్లుకూడా డిలీట్ చేయటం ఓటర్లను ఆందోళనకు గురిచేస్తోంది. ఒకే ఓటు ఉండటం, వారుకూడా అదే గ్రామంలో ఎన్నో దశాబ్దాలుగా నివాసం ఉంటున్నా వారి ఓటు తొలగింపు కింద డిలీట్ చేయటంపై గందరగోళం నెలకొంది. తెనాలి నియోజకవర్గంలోని పెదరావూరు, సంగంజాగర్లమూడి, అంగలకుదురు, కొలకలూరు, నందివెలుగు, తెనాలి పట్టణంలోని కొన్ని వార్డుల్లో ఓటర్ల పరిస్థితి ఇదే విధంగా ఉంది. ఒక్కో గ్రామంలో కనీసం ఒకటి, రెండు కుటుంబాల ఓట్లు డిలీట్ జాబితాలోకి వెళ్లటం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. కొన్నయితే గత సవరణ జాబితా ఓటర్ల లిస్ట్‌లోకూడా సక్రమంగా ఉంటే, ఈసారి జాబితాలో డిలీట్ అని రావటం వంటి విచిత్రాలు కూడా ఉన్నాయని ఓటర్లు చెబుతున్నారు.

తెనాలి పట్టణంలోని 23వ వార్డులో నాగూర్ నివాసం ఉంటున్న ఇంటి నంబర్ కింద వారి కుటుంబంలోని ముగ్గురు ఓట్లే ఉంటున్నాయి. అయితే ఈసారి వారి ఇంటిలో నివాసం ఉంటున్నట్టు అదే ఇంటి నంబర్‌తో రమేష్ దాస్ అనే ఓటు కొత్తగా వచ్చి చేరింది. అయితే గత మూడు సవరణలకు ముందే నాగూర్ దానిని గుర్తించి బీఎల్‌ఓలకు, రెవెన్యూ అధికారులకు వివరించినా, పలుసార్లు రాతపూర్వకంగా అందించినా ఈసారీ ఆ పేరును తొలగించలేదు. ఒకవేళ దానిని తొలగించకపోతే, రేపటి పోలింగ్ రోజున అదే ఓటు దొంగ ఓటు కింద పడే ప్రమాదం ఉందనే అనుమానాన్ని అతను వ్యక్తం చేస్తున్నారు.



తెనాలి నియోజకవర్గం పెదరావూరులో ఒకే కుటుంబంలోని ఐదు ఓట్లు డిలీట్ చేసిన చిత్రం



గ్రామంలోనే నివాసం ఉన్న కందేపు హరిప్రసాదరావు, పద్మలత దంపతుల ఓట్లు డిలీట్ చేసిన చిత్రం

టీడీపీలోకి.. రాయలు రాక

- నరసరావుపేట పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి ఎంపీ లావు
- త్వరలో తెలుగుదేశంలో చేరనున్న శ్రీకృష్ణదేవరాయలు
- లావుతో పాటు పలువురు వైసీపీ నేతలు టీడీపీలోకి...



నరసరావుపేట, ఫిబ్రవరి 1: నరసరావుపేట పార్లమెంట్ నుంచి సిట్టింగ్ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మరోసారి ఎన్నికల బరిలో దిగుతున్నారు. అయితే ఈ సారి తెలుగుదేశం పార్టీ నుంచి ఆయన పోటీ చేయనున్నారు. టీడీపీ అభ్యర్థిగా లావు పేరును ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఇటీవలే ఆయన వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. త్వరలోనే ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. 6వ తేదీ తర్వాత పార్టీలో చేరతారని ఆయన ముఖ్య అనుచరులు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. లావుతో పాటు వైసీపీలోని కొందరు ముఖ్య నేతలు టీడీపీలో చేరతారన్న ప్రచారం జరుగుతోంది. కొందరు జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మునిసిపల్ కౌన్సిలర్లు, పలువురు ముఖ్య నేతలు చేరనున్నట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి కూడా లావుతో కలసి టీడీపీలో చేరతారని విస్తృత ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే నారా లోకేశ్‌ను మక్కెన కలసినట్టు సమాచారం.

నరసరావుపేట పార్లమెంట్‌కు గత ఎన్నికల్లో లావు శ్రీకృష్ణ దేవరాయలు వైసీపీ అభ్యర్థిగా పోటీచేసి రాయపాటి సాంబశివరావుపై 1,53,978 ఓట్ల రికార్డు మెజార్టీతో గెలుపొందారు. అదే నరసరావుపేట పార్లమెంట్ వైసీపీ టిక్కెట్‌ను లావు ఆశించారు. అయితే ఆ పార్టీ అధిష్ఠానం ఆయనకు టిక్కెట్ నిరాకరించింది. గుంటూరు పార్లమెంట్ నుంచి పోటీ చేయాలని ప్రతిపాదించింది. నరసరావుపేట నుంచి పోటీ చేస్తానని గుంటూరుకు వెళ్లనని లావు తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో ఆయన ఆ పార్టీని వీడారు. ఇదిలా ఉంటే నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు పోటీ చేయనున్న టీడీపీ అభ్యర్థులతో లావు టచ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. సత్తెనపల్లి అసెంబ్లీకి టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పేరును పార్టీ అధిష్ఠానం ప్రకటించిన విషయం తెలిసిందే. మరో మూడు నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసినప్పటికీ అధికారికంగా అధిష్ఠానం వారి పేర్లు ప్రకటించలేదు.

నరసరావుపేట నియోజకవర్గంలో కొన్ని కీలక కేంద్ర పథకాలను మంజూరుచేయించడంతో లావు శ్రీకృష్ణదేవరాయలు విశేష కృషి చేశారు. వరికపూడిశెల ప్రాజెక్టు సంబంధించి వన్య ప్రాణి సంరక్షణ, అటవీశాఖల అనుమతులు రావడం వెనుక ఆయన కృషి ఉంది. రైతుల ప్రయోజనాల కోసం ఇండో ఇజ్రాయిల్ ప్రాజెక్టు సాధించారు. నకరికల్లు మండలం నర్సింగపాడు వద్ద ఇటీవల శంకుస్థాపన చేశారు. జిల్లాలోని పలు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చేందుకు ఆయన కృషి చేశారు. జిల్లాలో రెండు కేంద్రీయ విద్యాలయాలు మంజూరు చేయించారు. నియోజకవర్గ అభివృద్ధిపై లావు ప్రత్యేక దృష్టిసారించారు.

జిల్లాలో భారీగా.. డీఎస్పీల బదిలీ

- అత్యధిక మందికి స్థానచలనం
- దాదాపు అందరూ కొత్త ముఖాలే



గుంటూరు, ఫిబ్రవరి 1: రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని కొద్దిరోజులుగా జరుగుతున్న పోలీస్ అధికారుల బదిలీల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇప్పటికే ఎస్పీలు, అదనపు ఎస్పీలను బదిలీ చేసిన ప్రభుత్వం తాజాగా డీఎస్పీలను బదిలీ చేసింది. జిల్లాలో అత్యధిక మంది డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఎన్నికల కమిషన్ నిబంధనలతో పాటు స్థానిక వైసీపీ అభ్యర్థులు, ప్రజాప్రతినిధుల సిఫార్సుల ఆధారంగా పెద్దఎత్తున పోలీసుల బదిలీలు జరిగాయి.

బదిలీ అయిన డీఎస్పీల వివరాలు...

తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో విధులు నిర్వహిస్తున్న జీసీ గురునాథ్ బాబును సత్తెనపల్లి డీఎస్పీగా, డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న సి.విజయభాస్కరరావును నెల్లూరు, డీఎస్‌ఆర్‌పీకు బదిలీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు డీఎస్పీ వీఎస్‌ఎన్ వర్మను నరసరావుపేటకు, కమిషనరేట్‌లోని నార్త్ డివిజన్లో పనిచేస్తున్న సీహెచ్ రవికాంత్‌ను గుంటూరు నార్త్ డీఎస్పీగా, కమిషనరేట్‌లో దిశ డీఎస్పీగా పని చేస్తున్న వీవీ నాయుడును గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా నియమించారు. కమిషనరేట్‌లో సీటీఎఫ్ డీఎస్పీగా పనిచేస్తున్న బీవీ సుబ్బారావును దిశ డీఎస్పీగా, మైలవరంలో పనిచేస్తున్న ఎం.రమేష్‌ను గుంటూరు సీసీఎస్‌కు, గుంటూరు నార్త్ డీఎస్పీగా పనిచేస్తున్న జవంగుల రాంబాబును మచిలీపట్నం డీఎస్పీగా బదిలీ చేశారు. తుళ్లూరు డీఎస్పీ వి.పోతురాజును గుంటూరు స్పెషల్ బ్రాంచ్‌కు నియమించారు. గుంటూరు వెస్ట్ డీఎస్పీ బి.ఉమామహేశ్వరరెడ్డిని శ్రీకాళహస్తికి, సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణను తూర్పుగోదావరి, దిశ డీఎస్పీగా నియమించారు. అలాగే గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ మందుల బాలసుందరరావును మార్కాపురం, గుంటూరు సీసీఎస్ డీఎస్పీ కూరపాటి ప్రకాష్ బాబును ఎన్టీఆర్ కమిషనరేట్ దిశా డీఎస్పీగా నియమించారు. గుంటూరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ తుపాకుల వెంకటరత్న స్వామిని ప్రకాశం జిల్లా దిశా డీఎస్పీగా, నరసరావుపేట డీఎస్పీ కేవీ మహేష్‌ను వెస్ట్ డీఎస్పీగా, ప్రకాశం దిశా డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావును బాపట్ల క్రైమ్ డీఎస్పీగా, బాపట్ల దిశా డీఎస్పీ కె.నాగేశ్వరరావును డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. ఇంటిలిజెన్స్‌లో పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వరరావును తుళ్లూరు డీఎస్పీగా నియమించారు.

---

7 లో..

రానున్న ఎన్నికలపై ప్రత్యేక దృష్టి

- సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడమే లక్ష్యం
- రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్, మహిళల భద్రతకు ప్రాధాన్యత
- బాధ్యతలు స్వీకరించిన నూతన ఎస్పీ తుషార్ డూడీ



6 లో..

గంజాయి రవాణా చేస్తున్న యువకుల అరెస్టు

రూ.10 లక్షల గంజాయి స్వాధీనం

అభివృద్ధిని మరిచి.. దోపిడీ మరిగారు

మూడు ముక్కల ఆటతో రాష్ట్రం అధోగతి

1507వ రోజు ఆందోళనల్లో అమరావతి రైతులు



మందడం శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు

తుళ్లూరు ఫిబ్రవరి 1: వైసీపీ పాలకులు వచ్చిన దగ్గర నుంచి అభివృద్ధిని పూర్తిగా మరిచి, దోచుకోవడం మరిగారని రాజధాని రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తోన్న ఆందోళనలు, నిరసన దీక్షలు గురువారానికి 1507వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, మూడు రాజధానులని రాష్ట్రాన్ని సీఎం జగన్‌రెడ్డి అధోగతిపాలు చేశారన్నారు. అభివృద్ధి ఎక్కడా లేదని, అంతా అవినీతిమయం అయిపోయిందన్నారు. ఏ వ్యవస్థ సక్రమంగా పని చేయడం లేదన్నారు. బటన్ నొక్కి డబ్బు లేసి జనాన్ని జగన్‌రెడ్డి మభ్యపెడుతున్నారన్నారు. సీఎం జగన్ పన్నుల బాదుడుతో రూపాయి ఇచ్చి పది రూపాయలు కాజేస్తున్నాడని జనం తెలుసుకున్నారన్నారు. అమరావతిని నిర్వీర్యం చేసి రైతులను అష్టకష్టాలు పెడుతున్నారన్నారు. తమను నడి రోడ్డు మీదకు లాగిన జగన్‌రెడ్డి అంతకంత అనుభవించక తప్పదన్నారు. రాజధాని గ్రామాల్లో అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు.

గిరిజన సంక్షేమంపై విచారణకు ఆదేశం

'ఆంధ్రజ్యోతి' కథనానికి డైరెక్టర్ స్పందన

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 1: గిరిజన సంక్షేమ శాఖ వసతిగృహాల్లో జరుగుతున్న అక్రమాలపై విచారణకు ఆదేశించారు. 'వంటోళ్లే వార్డెన్లు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనంపై గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ స్పందించారు. ఉద్యోగ నియామకాలు, బదిలీలపై విచారణ చేపట్టాలని విద్యా శాఖ డైరెక్టర్‌ని ఆదేశించారు. ఏసీబీ తనిఖీల తర్వాత కూడా వార్డెన్‌పై చర్యలు తీసుకోకపోవడంపై కూడా ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరిపి నివేదిక అందజేయాలని ఆదేశించారు.

ఆర్‌వోఆర్ ఫైల్ మాయం?

గుంటూరు గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో అక్రమాలు ఒక్కోటి వెలుగు చూస్తున్నాయి. తాజాగా ఆ శాఖ పరిధిలో ఉమ్మడి జిల్లా ఉద్యోగుల ఆర్‌వోఆర్ ఫైల్(రూల్ ఆఫ్ రిజర్వేషన్) మాయమైనట్లు సమాచారం. ఉద్యోగోన్నతుల్లో అత్యంత కీలకపాత్ర పోషించే ఈ ఫైల్ మాయం కావడంపై ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. గతంలో తగిన అర్హత లేకపోయినా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా పనిచేసిన ఉద్యోగి హయాంలోనే ఆర్‌వోఆర్ ఫైల్ మాయమైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

విద్యార్థులకు అన్యాయం

కొందరు అధికారుల అవినీతి వల్ల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని గిరిజన సంక్షేమ సంఘ నేత చంద్రానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ కొందరికి కోట్ల రూపాయలు సంపాదించి పెట్టే కల్ప తరువుగా మారిందని ఆరోపించారు. పిల్లలు లేకుండానే ఉన్నట్లు చూపించి నిధులు డ్రా చేసిన వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. అర్హత లేని వ్యక్తులు ఉన్నత స్థాయిలో ఉంటే నిజమైన గిరిజనులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు.

హైదరాబాద్‌పై జార్ఖండ్ ఘనవిజయం



ప్రియాంక లూథ్రా, పల్వికా రాథోడ్, జాస్మిన్ గిల్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 1: బీసీసీఐ మహిళల అండర్-23 వన్డే టోర్నీలో భాగంగా మంగళగిరి ఏసీఏ మైదానంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టుపై జార్ఖండ్ ఘనవిజయం సాధించింది. జార్ఖండ్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు 45.3 ఓవర్లలో పది వికెట్లు కోల్పోయి కేవలం 139 పరుగులు మాత్రమే చేయ గలిగింది. హైదరాబాద్ జట్టులో టీ.చందన 30 పరుగులు, ఎం.సాక్షీరావు 28 పరుగులు సాధించగా, జార్ఖండ్ బౌలర్ పల్వికారాథోడ్ 3 వికెట్లు పడగొట్టింది. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనతో బ్యాటింగ్‌కు దిగిన జార్ఖండ్ జట్టు 41.3 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 142 పరుగులు సాధించి 4 వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. జార్ఖండ్ బ్యాటర్లు ప్రియాంక లూథ్రా 69 పరుగులు, శిఖా 40 పరుగులు చేయగా, హైదరాబాద్ బౌలర్ జాస్మిన్ గిల్ 3 వికెట్లు తీసింది. మంగళగిరి ఏసీఏ మైదానంలో తదుపరి మ్యాచ్ జార్ఖండ్, ఉత్తరాఖండ్ జట్ల మధ్య ఈ నెల 3న జరగనుంది.

ప్రజల్ని చైతన్య పరిచే అద్భుత కళ.. యక్షగానం

చిందు యక్షగాన కళాకారుడు పద్మశ్రీ గడ్డం సమ్మయ్య

అట్టహాసంగా ప్రారంభమైన విజ్ఞాన్ మహోత్సవం



గడ్డం సమ్మయ్యను సత్కరిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 1: ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు యక్షగానం కళ ఎంతో దోహదపడిందని పద్మశ్రీ అవార్డు గ్రహీత, చిందు యక్షగాన కళాకారుడు పద్మశ్రీ గడ్డం సమ్మయ్య తెలిపారు. చిన్న వయస్సు నుంచే ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలైన మద్యపాన నిషేధం, అక్షరాస్యత, కుటుంబ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, హెచ్ఐవీ వంటి కార్యక్రమా లపై వేలాది ప్రదర్శనలు ఇచ్చి ప్రజల్లో చైతన్యం తెచ్చానని తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో గురువారం విజ్ఞాన్ మహోత్సవ్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత కళైన చిందు యక్షగానానికి తాను చేస్తున్న సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. యువత చదువుకే పరిమితం కాకుండా యోగ, సంగీతం, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన డంతో పాటు సామాజిక సేవకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

సినీ సంగీత దర్శకుడు రఘు కుంచె మాట్లాడుతూ యువతలో అంతర్లీనంగా సృజనాత్మక శక్తులు ఉంటాయని దానిని వెలికితీయడానికే ఈ మహోత్సవాలన్నారు. చదువు అంటే పుస్తకాలు ఒక్కటే కాదని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా పాఠ్యాంశాలేనన్నారు. యువత తమ సహజ శక్తులను దేశ ప్రయోజనాలకు ఉపయోగించాలన్నారు. యువత కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు కృషి చేయాలని సూచించారు. విజ్ఞాన్ ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ వర్సిటీ గడిచిన 20 ఏళ్ల నుంచి నిరంతరాయంగా విజ్ఞాన్ మహోత్సవాన్ని నిర్విరామంగా చేస్తున్నామని తెలిపారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహోత్సవ్‌లో 75 ఈవెంట్లను ప్రారంభించారు. సంబరాల్లో భాగంగా సాంస్కృతిక ప్రద ర్శనలు ఆహుతులను విశేషంగా అలరిం చాయి. కళాకారులు పలు నృత్య రూపకా లకు అనుగుణంగా నర్తించి మంత్రము గ్ధుల్ని చేశారు. జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఓలలాడించాయి. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే ధ్యానం, యోగాతోనే సాధ్యమని చూపించిన నృత్య ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఇసుక తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

అనుమతులు చూపించే వరకు తవ్వకాలు నిలిపివేయాలన్న గ్రామస్తులు

కొల్లూరు, ఫిబ్రవరి 1: నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక తవ్వకాల వల్ల ఊరు కనుమరుగయ్యే పరిస్థితి వస్తుందని తవ్వకాలను మండల పరిధిలోని పెదలంక గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. అనుమతులు చూపించాలని పెద్దసంఖ్యలో గ్రామస్తులు వెళ్లి జీసీకేసీ నిర్వాహకులతో వాగ్వివాదానికి దిగారు. ఇష్టానుసారంగా ఎక్కడిబడితే అక్కడ పెద్దపెద్ద గోతులు పెట్టి తవ్వకాలు చేస్తే వరద నీరు గ్రామాల్ని ముంచి వేస్తుందని మండిపడ్డారు. గతంలో వరదల వల్ల విరిగిపోయిన పొలాల్లో ఇసుక మేటలను అనుమతులు లేకుండా ఎలా తవ్వుతున్నారని ప్రశ్నించారు. అనుమతులు చూపించాలని, అప్పటి వరకు తవ్వకాలు చేస్తే సహించేది లేదన్నారు. అనుమతులు ఉన్నాయని వాట్సాప్‌లో పంపిస్తామని చెప్పినా పత్రాలు చూపించాలని డిమాండ్ చేశారు. దీంతో యంత్రాలతో నిర్వాహకులు వెళ్లిపోయారు.



ఇసుక తవ్వకాలు అడ్డుకున్న గ్రామస్తులు

చంపినా సరే వైసీపీలో కొనసాగం

ఎమ్మెల్యే నుంచి బెదిరింపు కాల్స్

గురజాల వైసీపీ కౌన్సిలర్ అనిత

గురజాలటౌన్, ఫిబ్రవరి 1: చంపినా సరే తాము వైసీపీలో కొనసాగేది లేదని, ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డికి తలవంచేది లేదని 12వ వార్డు వైసీపీ కౌన్సిలర్ మహంకాళి అనితనీలంరాజు తేల్చి చెప్పారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పార్టీని నమ్ముకుని తాము ఎన్నో కష్టాలు పడ్డామని, ఇందుకు సరైన గుణపాఠం చెప్పార ని ఆవేదన వ్యక్తం చేశారు. లావు శ్రీకృష్ణదేవరాయలుకు మద్దతుగా తాను, తన భర్త రాజీనామా ప్రకటించామన్నారు. దీంతో తన భర్తకు కొద్ది రోజులుగా బెదిరింపు కాల్స్ వస్తున్నాయన్నారు. మాలధారణలో ఉన్న తన భర్త బుధవారం వీరభద్రస్వామి ఆలయానికి సద్ది కోసం వెళ్తుండగా మాచవరం ఎస్ఐ సమీర్‌బాషా కానిస్టేబుళ్లు వచ్చి బలవంతంగా తీసుకెళ్లారన్నారు. కౌన్సిలర్ భర్త నీలంరాజు మాట్లాడుతూ పోలీసులు చిత్రహింసలు పెట్టి కొట్టారన్నారు. తమకు ప్రాణహాని ఉందని దంపతులు తెలిపారు. ఎన్నికల్లో సీటు ఇచ్చి రూ.9 లక్షలు డబ్బులు ఇచ్చామని, తమాషా ఆడుతున్నావా అంటూ నీలంరాజుపై ఎమ్మెల్యే కాసు మండిపడిన ఆడియో కాల్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయనున్నట్లు అనిత నీలంరాజు ప్రకటించారు. భార్యాభర్తలు గతంలో వైసీపీకి రాజీనామా చేయగా తాజాగా కౌన్సిలర్ పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. తాము ఊర్లో లేనందున ఈనెల 5న మున్సిపల్ కమిషనర్‌కు రాజీనామా పత్రం అందిస్తామని తెలిపారు.



మహంకాళి అనితనీలంరాజు

గంజాయి రవాణా చేస్తున్న యువకుల అరెస్టు

రూ.10 లక్షల గంజాయి స్వాధీనం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 1: శ్రీకాకుళం జిల్లా నుంచి హైదరాబాద్‌కు మోటారు సైకిళ్లపై గంజాయిని రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను చిలకలూరిపేట రూరల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. రూరల్ సర్కిల్ కార్యాలయంలో వారిని మీడియా ఎదుట హాజరుపరిచి రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి వివరాలు తెలిపారు. అరెస్టు అయిన వారిలో హైదరాబాద్‌లోని పురానాపూల్‌కు చెందిన చింతల కుట్టి శివకుమార్(19) ఒరిస్సాలోని మల్కనగిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ గులబీగూడ గ్రామానికి చెందిన కిముడు శంకర్(19) ఉన్నారన్నారు. వీరు విశాఖపట్నం జిల్లా సీలేరు వద్ద గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించి సొమ్ము చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో వీరిద్దరూ మరో ముగ్గురు యువకులు కలిసి మోటారు సైకిళ్లపై విశాఖపట్నం జిల్లా సీలేరుకు వెళ్లి గంజాయిని కొనుగోలు చేసి అదే మోటారు సైకిళ్లపై హైదరాబాద్ బయల్దేరారు. ఈ సమాచారం తెలిసి వారిలో ఇద్దరిని అరెస్టు చేశామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నారని సీఐ తెలిపారు. వారి నుంచి 107.845 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాని విలువ రూ.10 లక్షలు అన్నారు. గంజాయి రవాణాకు ఉపయోగిస్తున్న రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని బస్తీలు, కళాశాలల్లో విక్రయించి డబ్బు సంపాదించాలని గంజాయిని రవాణా చేస్తున్నట్లు తమ విచారణలో వారు తెలిపారన్నారు. సమావేశంలో ఎస్ఐలు జీ రవికృష్ణ, ఈ బాలకృష్ణ, జే శామ్యూల్ రాజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

వివాదంలో ఉన్న భూమి మంత్రి అంబటి కొనుగోలు



విలేకరులతో మాట్లాడుతున్న కొత్తపల్లి విజయ ప్రసాద్, టీడీపీ నేతలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 1: కోర్టు వివాదంలో ఉన్న తమ భూమిని మంత్రి అంబటి రాంబాబు కొనుగోలు చేశారని పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి మండలం ఎంపీపాలేనికి చెందిన కొత్తపల్లి విజయప్రసాద్ తెలిపారు. గురువారం సత్తెనపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు. రాజుపాలెం మండలం రెడ్డిగూడెంలో సర్వే నెంబరు 298/2ఏలో తమ నాయనమ్మ సరోజనమ్మకు రెండు ఎకరాలకు పైగా భూమి ఉండగా 2013లో కొందరు తప్పుడు సర్వే నెంబరుతో ఆ భూమిని ఆక్రమించుకున్నారన్నారు. దీనిపై 2014లో తాము కోర్టును ఆశ్రయించామన్నారు. అప్పటి నుంచి కోర్టులో కేసు నడుస్తుండగా ఆ భూమిని మంత్రి అంబటి రాంబాబు 18 జూలై 2022న తాడికొండ మండలం పొన్నెకల్లుకి చెందిన బొడ్డపాటి శివకృష్ణతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. సమాచారం తెలుసుకున్న తాము కోర్టు ద్వారా మంత్రికి నోటీసులు కూడా జారీ చేశామన్నారు. అంబటి బినామీగా ధూళ్ళిపాళ్ళకు చెందిన రావిపాటి పురుషోత్తం పవర్ ఆఫ్ అటర్నీ రాయించుకున్నారన్నారు. అంబటితో తనకు ప్రాణ భయం ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి భీమినేని వందనాదేవి మాట్లాడుతూ అంబటి అవినీతిపై ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరిస్తామని తెలిపారు.



భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న మంత్రి అంబటి రాంబాబు, రాయపాటి పురషోత్తమరావు కాపీ

ప్రీ ఆడిట్ కు 10 శాతం : ఖజానా కార్యాలయంలో వసూళ్లు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 1: జిల్లా ఖజానా కార్యాలయంలో అవినీతికి అడ్డు అదుపు లేకుండా పోతోంది. తోటి ప్రభుత్వ ఉద్యోగులన్న కనికరం లేకుండా ప్రీ ఆడిట్‌లో ముక్కు పిండీ వసూలు చేయడం వివాదాస్పదమౌతోంది. బిల్లు పాస్‌కు అంతోఇంతో ఇవ్వాలని కాకుండా, కచ్చితంగా 10 శాతం ఇవ్వాల్సిందే అంటూ పట్టుపట్టడంపై బాధిత ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఉద్యోగికి రూ.13 లక్షలు బకాయిలు రావాల్సి ఉండగా ప్రీ ఆడిట్ చేసిన అధికారులు రూ.1.30 లక్షలు ఆశించినట్లు ఆరోపణలున్నాయి. అందుకు సదరు ఉద్యోగి ఒప్పుకోకపోవడంతో దానిని మధ్యలో నే నిలిపివేశారని తెలిసింది. కొందరు రోజువారీ జీతంతో పనిచేస్తున్న ఉద్యోగులు తమ పర్మినెంట్ కోసం కోర్టుకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చుకుకోగా ప్రభుత్వం జీవో 610 విడుదల చేసింది. ఈ జీవో కింద నియమితులైన ఉద్యోగుల వద్ద ఒక్కొక్కరి నుండి రూ.2 లక్షల వరకు వసూలు చేశారని ఆరోపణలు వచ్చాయి.

ఉపేక్షించేది లేదు..

అవినీతికి పాల్పడుతున్న వారిని ఉపేక్షించేది లేదని జిల్లా ఖజానా అధికారి రాజగోపాలరావు అన్నారు. అధికారులపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆటో బోల్తా, డ్రైవర్ మృతి

తాడికొండ, ఫిబ్రవరి 1: ఆటో అదుపుతప్పి పంట కాల్వలోకి దూసుకెళ్లి బోల్తా పడటంతో డ్రైవర్ వట్టిచెరుకూరు మండలం గారపాడు గ్రామానికి చెందిన పల్లపాటి కోటేశ్వరరావు(50) మృతి చెందాడు. తాడికొండ-కంతేరు రోడ్డులో గురువారం ఈ ఘటన జరిగింది. తాడికొండ మండలం కంతేరు నుంచి తాడికొండ అడ్డరోడ్డుకు ముగ్గుర్ని ఆటోలో ఎక్కించుకుని కోటేశ్వరరావు వెళ్తున్నాడు. ఈక్రమంలో ఆటో అదుపుతప్పి పంట కాల్వలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రులను గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	214.00
చికెన్ స్కిన్ లెస్	224.00

1,20,528 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,24,034 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,20,528 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 79,912 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	13000	19000
273	8500	17500
341	9000	21200
4884	11000	16500
సూపర్ 10	15000	17500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21500
బ్యాడిగి	9500	20500
దేవనూరు డీలక్స్	9500	20000
తెల్లకాయలు	5000	12500

డీఎస్సీ పేరిట జగన్ మరో మోసం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 1: డీఎస్సీకి మంత్రి వర్గ ఆమోదం అంటూ మరోసారి నిరుద్యోగులను తనదైన శైలిలో మోసం చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధమయ్యారని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. జగన్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో హామీ ఇచ్చిన మెగా డీఎస్సీ ఏమైందో ఇప్పటికైనా సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల ముందు డీఎస్సీ అంటూ జగన్ సర్కారు నిరుద్యోగ యువతను మోసం చేస్తుందని విమర్శించారు. అధికారంలోకి రాగానే యువతకు 2.3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, ఏటా జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ అని చెప్పారన్నారు, ఆ మాటలు నమ్మి డీఎస్సీ కోసమే ఏడు లక్షల మంది నిరుద్యోగులు నిద్రాహారాలు మాని, అప్పులు చేసి కోచింగ్‌లు తీసుకుంటూ కష్టపడుతున్నారన్నారు. ఐదేళ్లుగా వారి జీవితాలతో చెలగాట మాడింది కాకుండా ఇప్పుడు ఆరు వేల పోస్టులతో నోటిఫికేషన్ అనడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులోనూ రెండేళ్ల గౌరవ వేతనంతో అప్రెంటీస్ విధానం తిరిగి తీసుకురావడం దారుణం, నయవంచన అన్నారు. ప్రతిపక్షంలో ఉండగా జగన్ చెప్పిన 23 వేల ఉపాధ్యాయ పోస్టులు ఐదేళ్ల తర్వాత కూడా ఆరు వేలకు ఎలా తగ్గాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్‌రెడ్డి కుర్చీ పీకడానికి నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు.

మెగా డీఎస్సీ పేరుతో జగన్ దగా : కన్నా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 1: మెగా డీఎస్సీ పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగులను మోసం చేశారని మాజీ మంత్రి, సత్తెనపల్లి టీడీపీ ఇన్‌చార్జి కన్నా లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోసమే డీఎస్సీ ఇచ్చినట్లు అర్థమవుతుందన్నారు. గత ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే 23 వేల టీచర్ల పోస్టులు భర్తీ చేస్తానని హామీ ఇచ్చిన జగన్ సీఎం అయ్యాక ఐదేళ్లు ఆ మాట మరచి పోయాడన్నారు. దిగి పోయే ముందు ఆరు వేల పోస్టుల భర్తీకి డీఎస్సీ ప్రకటించటం నిరుద్యోగులను మోసం చేయడమేనన్నారు. 2019 నుంచి ఒక్క డీఎస్సీని కూడా విడుదల చేయలేదన్నారు. జీవో 117తో ఉన్న ఖాళీలను కుదించి వేశారన్నారు. తక్కువ పోస్టులతో ప్రకటన జారీ చేయడం వల్ల లక్షలాది మంది నిరుద్యోగులకు నిరాశ మిగిలిందని తెలిపారు. నిరుద్యోగుల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను కప్పి పుచ్చుకోవడానికి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు.

ప్రభుత్వ భూములు అమ్ముకుంటున్నారు

వైసీపీ నేతలపై మాజీ ఎమ్మెల్యే యరపతినేని ధ్వజం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 1: గురజాల నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను వైసీపీ నేతలు ఆక్రమించుకుని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కొందరు రెవెన్యూ అధికారుల అండతో అమ్మేసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. అయినా రెవెన్యూ శాఖ మౌనం దాల్చడంపై సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఐదేళ్లలో మూడు వేల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని సర్వే నెంబర్లు, రెవెన్యూ రికార్డుల మార్పులు చేసి భూములను కాజేసిన వైసీపీ నేతలు వాటిని బ్యాంక్‌ల్లో తనఖా పెట్టి రుణాలు తీసుకున్నారన్నారు. అనుమతులు లేకుండా మైనింగ్ చేస్తున్నా అధికారులు తనిఖీలు చేయడం లేదన్నారు. చెరువు, వాగు పోరంబోకు భూములపై నిషేధం ఉన్నా ఆక్రమించుకుని రిజిస్టర్ చేయించుకుంటున్నారన్నారు. పిడుగురాళ్ల చెరువు భూములను విక్రయిస్తున్నారన్నారు. మాజీ జడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి, పిడుగురాళ్ల వీఆర్వో సత్యారెడ్డి, స్టాంపు రైటర్ లింగారెడ్డి బైపాస్ రోడ్డు సమీపంలోని సర్వే నెంబరు 579, మరికొన్ని నెంబర్లతో రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేసుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అధికారులు, సబ్ రిజిస్ట్రార్‌లు విచారణ జరిపి రిజిస్ట్రేషన్లను నిలిపివేసి ప్రభుత్వ భూమిగా ప్రకటించాలన్నారు. వైసీపీ భూ మాఫియాపై ప్రజాప్రభుత్వంలో విచారణ జరిపి, వారికి సహకరించిన అధికారులను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

రైతులపై దాడి చేయించిన ఎమ్మెల్యే బొల్లా : జీవీ

వినుకొండ, ఫిబ్రవరి 1: ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తన అనుచరులతో రైతులపై దాడులు చేయించి వారి పైర్లను కోయించి రౌడీయిజం చేస్తున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆరోపించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో జీవీ మాట్లాడుతూ బొల్లాపల్లి మండలం వెల్లటూరులో బేతపూడి అమరలింగయ్య అనే రైతు మిర్చి సాగు చేయగా ఆ భూమిని తన మనమరాలికి ఇచ్చేందుకు ఎమ్మెల్యే బొల్లా సిద్ధమయ్యారన్నారు. అమరలింగయ్య భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించగా ఆయన కలెక్టర్, జేసీ, డీఆర్‌వో, తహసీల్దార్లకు ఫిర్యాదు చేశారన్నారు. అయితే వారు పట్టించుకోకపోవడంతో గవర్నర్‌ను బాధిత కుటుంబం కలసి ఫిర్యాదు చేసిందన్నారు. గవర్నర్ ఆదేశాల మేరకు స్పందించి ఆ భూమి అమరలింగయ్యదేనని రెవెన్యూ అధికారులు నిర్ధారించారన్నారు. ఎమ్మెల్యే అధికారాన్ని అడ్డం పెట్టుకుని వినుకొండలోని తన అనుచరులతో సాగులో ఉన్న మిర్చి పంటను, నీళ్ల పైపులను కోయించి పొలంలోని రెండు బోర్లను పూడ్చివేయించారన్నారు. తమపై దౌర్జన్యంచేసి, దాడి చేశారని బండ్లమోటు పోలీస్‌స్టేషన్‌లో అమరలింగయ్య కుటుంబం ఫిర్యాదు చేసి ఆరు రోజులైనా పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అమరలింగయ్య మిర్చిపంటను, బోర్లను ధ్వంసం చేసిన దుండగలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామన్నారు.

బీసీలను అవమానించిన వైసీపీ ప్రభుత్వం

పల్నాడు జిల్లా బీసీలను వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా అవమానించిందని జీవీ ఆంజనేయులు తెలిపారు. పల్నాడు జిల్లాలో బీసీలు లేనట్లుగా నెల్లూరు నుంచి నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా అనిల్‌కుమార్‌యాదవ్‌ను ప్రకటించడంపై ప్రజలు వైసీపీని ఛీ కొడుతున్నారన్నారు. అనిల్‌కుమార్ యాదవ్ ఎమ్మెల్యేగా, మంత్రిగా అక్రమ సంపాదనకు పాల్పడ్డారని, నెల్లూరులో బీసీలకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. అక్కడ చెత్త ఇక్కడ బంగారమెలా అవుతుందో చెప్పాలని సీఎం జగన్మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం బీసీలను చిన్నచూపు చూసి పదవులు, రిజర్వేషన్లలో కోత విధించడం వల్ల 12 వేల మంది బీసీలు పదవులను కోల్పోయి తీవ్రంగా నష్టపోయారన్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో చంద్రబాబు బీసీల అభ్యున్నతికి సబ్‌ప్లాన్ ద్వారా రూ.75 వేల కోట్లు ఖర్చు చేస్తే జగన్‌రెడ్డి ప్రభుత్వం వాటిని తొలగించి బీసీలను మోసం చేసిందన్నారు. సమావేశంలో టీడీపీ జాతీయ క్రమశిక్షణ సంఘం సభ్యుడు గుంటుపల్లి నాగేశ్వరరావు, వై.నాగేశ్వరరావు, రాష్ట్ర యాదవ సాధికార సమితి అధ్యక్షుడు మానుకొండ శివప్రసాదరావు, నాగేశ్వరరరావు, గోవిందనాయక్, ఆయుబ్‌ఖాన్ పాల్గొన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

కేంద్ర నిధుల సాధనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

● ప్రత్యేక హోదా ఊసే ఎత్తని వైసీపీ ఎంపీలు

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ



గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు సాధించడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందని, 31 మంది ఎంపీలు ఉండి సాధించింది శూన్యమేనని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి ఈ ఏడాదితో పదేళ్ల కాలపరిమితి ముగుస్తున్నా రాష్ట్రా నికి నిధులసాధనలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రం అన్ని రంగాల్లో తీవ్రంగా నష్టపోయిందని, 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని ఉత్తరకుమార ప్రగల్భాలు పలికిన జగన్‌రెడ్డి 31 మంది ఎంపీలను పెట్టుకుని రాష్ట్రానికి ఏం సాధించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకహోదా, విభజన హామీలు, దుగరాజపట్నంపోర్టు, పోలవరం ప్రాజెక్టుకు తగిన నిధులు, నిర్వాసితులకు నష్ట పరిహారంగా పునరావాసం కల్పన వంటి అంశాలపై కేంద్ర బడ్జెట్ నుంచి నిధులు సాధనలో జగన్‌రెడ్డి ఎంపీలు పూర్తిగా విఫలం చెందారన్నారు. రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం 53 ఎకరాల భూమిని కేటాయించాలని కోరగా, జగన్ ప్రభుత్వం ఇప్పటికీ ఆ భూమిని అప్పగించకపోవడం నిర్లక్ష్యం కాదా అని నిలదీశారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్ ప్రకటనచూసి వైసీపీ నేతలు సిగ్గుపడాలన్నారు. విభజనచట్టంలో కేటాయించిన 11 జాతీయ విద్యా సంస్థలను టీడీపీ ప్రభుత్వం తీసుకొస్తే వాటికి నిధులను తేలేకపోవడం జగన్ రెడ్డి వైఫల్యమన్నారు. ప్రత్యేకహోదా, విజభన హామీల సాధన కోసం వైసీపీ ప్రభుత్వం కేంద్రంపై పోరాటం చేయాలని మన్నవ డిమాండ్ చేశారు.

అరాచక పాలనకు ఓటుతోనే బుద్ధి చెప్పాలి

● టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్



గుంటూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, రాష్ట్ర ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు జగన్‌రెడ్డికి లేదని టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. గుంటూరు నగర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను జగన్‌రెడ్డి నాశనం చేశాడని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సామాజిక సాధికారిక యాత్ర పేరుతో యాత్ర చేస్తున్న వైసీపీకి ఆ నైతిక హక్కు ఉందా అని నిలదీశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ గుర్తు ఫ్యాన్‌కు ఓటువేస్తే మెడకు ఉరితాడు బిగించుకున్నట్లేనని చెప్పారు. వైసీపీ కక్షపూరిత రాజకీయాలతో రాష్ట్రాభివృద్ధి ముందుకు కదల్లేదని విమర్శించారు. జగన్‌రెడ్డి పాలనపై రాష్ట్ర ప్రజలు విసుగుచెంది ఉన్నారని, ఈ ప్రభుత్వాన్ని ఎప్పుడు ఇంటికి సాగనంపుదామా? అని ఎదురుచూస్తున్నారని డేగల ప్రభాకర్ అన్నారు.

వైసీపీని తరిమి కొట్టడానికి ప్రజలు సిద్ధం

● టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య



గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి వైసీపీని తరిమి తరిమి కొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య అన్నారు. గుజ్జనగుండ్లలోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోరుకి సిద్ధమని పొలికేకలు కాదు, సీఎం జగన్ తలకిందులుగా తపస్సు చేసినా, రోడ్లపై పొర్లు దండాలు పెట్టినా ప్రజలు అతడిని నమ్మి మరోసారి ఓటేసే స్థితిలో లేరన్నారు. టీడీపీ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరని, వైనాట్ పులివెందులే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టంచేశారు. పులివెందుల సహా 175 నియోజకవర్గాలలో ప్రజలు జగన్ చీటీ చించుతారనే భయంతో తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ నిద్రలేని రాత్రులు గడుపుతూ ఉన్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. జగన్ ఎన్ని కుట్రలు పన్నినా ఈ ఎన్నికలతో వైసీపీని పాతిపెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని నిమ్మల శేషయ్య స్పష్టం చేశారు.

జగన్ పాలనలో దళితుల పరిస్థితి దయనీయం

గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి అధికారంలో దళితుల పరిస్థితి రోజురోజుకి దిగజారిపోతూ, దయనీయంగా మారిందని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిమెట్ల దయారత్నం అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలను, ఎస్సీల అభివృద్ధిని నిర్వీర్యం చేసి, అంబేద్కర్ విగ్రహం పెట్టి దళితుల ఓట్లు కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని అన్నారు. ఎస్సీల మేనమామనని చెప్పుకొని దళితుల ఓట్లే ప్రధానంగా అధికారాన్ని చేపట్టిన జగన్ రెడ్డి గడచిన నాలుగున్నర ఏళ్లలో ఎస్సీ పథకాలన్నీ రద్దుచేసి, ఎస్సీల అభివృద్ధిని నిర్వీర్యం చేసి, దళితులపై ఉన్న వివక్షతను బుజువు చేసుకున్నారని అన్నారు. సమావేశంలో గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి బత్తుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎం కళాధర్

బకాయిలు చెల్లించకుంటే మూల్యం తప్పదు

● యూటీఎఫ్ నేతల హెచ్చరిక ● రెండో రోజు కొనసాగిన రిలే దీక్షలు

గుంటూరు (విద్య), ఫిబ్రవరి1: ఉద్యోగ, ఉపాధ్యాయుల జీతం నుంచి పొదుపు చేసుకొని దాచుకున్న డబ్బును తిరిగి చెల్లించకుండా మొండిగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీ. ఆదిలక్ష్మీ, ఎం కళాధర్ హెచ్చరించారు. బకాయిలు కోసం కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న రిలే నిరాహారదీక్షల్లో భాగంగా గురువారం శిబిరాన్ని సంఘం నేతలు టీ.వినోద, కే.భావన్నారాయణ ప్రారంభించారు. ఆదిలక్ష్మీ, కళాధర్‌లు మాట్లాడుతూ తాము ప్రభుత్వ వరాలకోసం పోరాటం చేయటలేదని తాము దాచుకున్న డబ్బు తిరిగి ఇవ్వమని మాత్రమే పోరాటం చేస్తున్నామని స్పష్టంచేశారు. రూ.20వేలకోట్ల బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం ఉద్యోగులను ఆవేదనకు గురి చేస్తుందని ధ్వజమెత్తారు. దాచుకున్న సొమ్ము ఉందా? లేదా అనే విషయం తెలియడంపై సందేహాలున్నాయన్నారు. క్యాబినెట్ సమావేశంలో డీఏ, ఐఆర్ ప్రకటిస్తారని భావించిన తమకు నిరాశే ఎదురైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బకాయిలు, డీఏ, ఐఆర్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జీ.వెంకటేశ్వర్లు శివపార్వతి, కోశాధికారి ఎండి.దౌలా, ఆదినారాయణ, కె.సాంబశివరావు. జీ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దళిత, ఆదివాసీ మేనిఫెస్టో విడుదల

గుంటూరు, ఫిబ్రవరి 1: రాష్ట్రంలో 25 శాతంగా ఉన్న దళిత ఆదివాసీల ఆకాంక్షల అక్షర రూపమే దళిత ఆదివాసీ మేనిఫెస్టో-2024 అని దళిత బహుజన రీసోర్స్‌సెంటర్(డీబీఆర్‌సీ) కార్యదర్శి అల్లడి దేవకుమార్ తెలిపారు. బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో గురువారం ఆంధ్రప్రదేశ్ దళిత ఆదివాసీ మేనిఫెస్టో-2024 ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దేవకుమార్ మాట్లాడుతూ డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో దళిత ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి, సాధికారతకోసం కృషిచేస్తున్న వివిధ సంఘాలు, సంస్థల నేతలతో సంప్రదింపులు జరిపి మేనిఫెస్టోను రూపొందించినట్లు వివరించారు. రాష్ట్రంలోని దళితులు, ఆదివాసీలు, సంచారజాతుల ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్ళు, పరిష్కారంకోసం నిర్దిష్టమైన ప్రతిపాదనలను మేనిఫెస్టోలో పొందుపరిచామన్నారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్, మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఆదివాసీ, దళిత అజెండాతో ముందుకెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేడిద బాబురావు, మల్లెల చిన్నప్ప, జ్యోతి, దార్ల కోటేశ్వరరావు, భగవాన్‌దాస్, రమణమూర్తి, హేమలత పాల్గొన్నారు.



మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల నేతలు

టీడీపీకి సామాన్యులే స్టార్ క్యాంపెనర్లు



బాబు ష్యూరిటీ పత్రాలు ఇస్తున్న మొహమ్మద్ నసీర్

● సీఎం జగన్‌రెడ్డిని గద్దె దించడానికి సిద్ధంగా ఉన్న ప్రజలు

● టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): టీడీపీకి సామాన్యులే స్టార్ క్యాంపెయినర్లని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు ఐపీడీ కాలనీలో గురువారం ఆయన భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న జగన్ రెడ్డి ప్రజల్లో తనకున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు. ప్రచార పిచ్చితో సోషల్ మీడియా వేదికగా కొంతమందికి డబ్బులు చిల్లరగా వేసి పేటీఎం కూలీల చేత డబ్బా కొట్టించుకుంటున్నాడని, కానీ ప్రజలు రాష్ట్రం నుంచి జగన్‌రెడ్డిని పంపించడానికి సిద్ధంగా వున్నారన్నారు. స్వయంగా ప్రజలే టీడీపీ, జనసేన పార్టీలకు స్టార్ క్యాంపెయినర్లుగా మారి రాష్ట్ర భవిష్యత్తుకోసం పనిచేస్తున్నారని, సైకో ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సురే శ్రీనివాసరావు, పుట్టగంటి వెంకటేశ్వరావు, పాటిబండ్ల శ్రీనివాసరావు, ఈర్ల గురువయ్య, వజ్జా లక్ష్మి చండ్లగుండ్ల కోటేశ్వరరావు, మల్లెంపుడి కోటేశ్వరరావు, కొమ్మినేని కోటేశ్వరరావు, మీరా వలి, కార్పొరేటర్లు ముప్పవరపు భారతి, పోతురాజు సమత, వాణి జనసేన నాయకులు రాటంశెట్టి జగన్ మోహన్ రావు, అల్లం పూర్ణ చంద్రరావు, గణప శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

టీడీపీ, జనసేన కూటమిదే విజయం

● జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన వెల్లడి



మాట్లాడుతున్న బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, గాదె వెంకటేశ్వరరావు

గుంటూరు, ఫిబ్రవరి 1: రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిదే విజయమని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ ధీమా వ్యక్తంచేశారు. అమరావతి రోడ్డులోని జనసేన పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పశ్చిమ నియోజకవర్గంలో రేపటి నుంచి 'జనంతో జనసేన' అనే కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు బోనబోయిన తెలిపారు. వైసీపీ ప్రభుత్వం దోచుకో.. దాచుకో అనే పద్ధతిలో వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. జగన్ రెడ్డి ఎన్నికలకు సిద్ధమా? అని ఫ్లెక్సీలు వేస్తున్నాడని, కానీ టీడీపీ, జనసేన కూటమి రెండేళ్ల కిందటే ఎన్నికలకు సిద్ధంగా ఉన్న విషయాన్ని జగన్ రెడ్డి గుర్తించుకోవాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా టీడీపీ, జనసేన కూటమిదే విజయమన్నారు. జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల సొమ్ము కాజేసి సోకులు చేసుకుంటున్న వైసీపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. అనంతరం 'జనం కోసం జనసేన' కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జనసేన అర్బన్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల సురేష్, మహిళా వింగ్ రీజనల్ కోఆర్డినేటర్ పార్వతి నాయుడు, అడపా మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయం ప్రారంభిస్తున్న బీజేపీ సీనియర్ నేత జూపూడి రంగరాజు

బీజేపీ గుంటూరు లోక్‌సభ

ఎన్నికల కార్యాలయం ప్రారంభం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 1: భారతీయ జనతాపార్టీ అధినేతల పిలుపు మేరకు బీజేపీ గుంటూరు లోక్‌సభ ఎన్నికల కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలయుద్ధం మొదలైంది అని చెప్పడానికి ఇదే ఉదాహరణ అని అన్నారు. ఈఎన్నికల్లో కేంద్రంలో మరొక్కసారి రాష్ట్రంలో మొదటిసారి భారతీయ జనతా పార్టీకి అవకాశం ఇవ్వాలని ప్రజల్ని అభ్యర్థిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన వనమా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీల్లో వారసత్వ రాజకీయాలు కొనసాగుతున్నాయని, కానీ బీజేపీలో అలాంటి వాటికి అవకాశమే లేదన్నారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనామా సరేంద్ర కుమార్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ, మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, ఫిబ్రవరి 1: బ్రాడీపేట 4వ లైనులో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీ-8 సెక్షన్ ఏఈ చిట్టిబాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

షర్మిలపై కావటి వ్యాఖ్యలు హేయం

● ఉపసంహరించుకోవాలని ఎన్ఎస్‌యూఐ నేతల డిమాండ్

గుంటూరు, ఫిబ్రవరి 1: ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలపై నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు చేసిన వ్యాఖ్యలను ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా డిమాండ్ చేశారు. మేయర్ వ్యాఖ్యలకు నిరసనగా రాజీవ్‌గాంధీభవన్ ఎదుట ఎన్ఎస్‌యూఐ నేతలు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. వైఎస్ షర్మిలను అడ్డుపెట్టుకొని అధికారంలోకి వచ్చిన వైసీపీ నేతలు ఆమెపై విమర్శలు చేయటం సిగ్గుచేటన్నారు. నాడు వైఎస్ షర్మిళ పాదయాత్ర చేయకుంటే వైసీపీ ఏనాడో కాలగర్భంలో కలిసిపోయి ఉండేదని అన్నారు. ఇప్పటికైనా షర్మిళపై అనుచిత వ్యాఖ్యలు మానుకుంటే మంచిదని హెచ్చరించారు. నగరంలో రహదారులన్నీ అధ్వానస్థితిలో ఉన్నా పట్టించుకోని మేయర్, వైసీపీ ఎమ్మెల్యేలు విమర్శలతో కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. త్వరలో వైసీపీ నేతలకు ప్రజలు గట్టిగానే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీసీ లీగల్‌సెల్ అధ్యక్షుడు యన్నం సుధీర్ బాబు, భాగ్యరాజ్, మోషే, జయరామ్, సాంబశివరావు పాల్గొన్నారు.

ఇంటర్ పర్యావరణ పరీక్ష వాయిదా

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 1: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా అర్హతపరీక్షగా నిర్వహించే పర్యావరణ విద్య (ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్) పరీక్షను ఇంటర్‌బోర్డు వాయిదా వేసింది. 3వ తేది శనివారం జరగాల్సిన పరీక్షను ఈ నెల 23 శుక్రవారానికి వాయిదా వేసినట్టు గురువారం ఓ ప్రకటనలో ఇంటర్ బోర్డు ఆర్ఐవో జుబేర్ పేర్కొన్నారు. అయితే ఈ పరీక్ష ఎందుకు వాయిదా వేశారనే విషయాన్ని మాత్రం బోర్డు అధికారులు ప్రకటించలేదు.

విధుల్లో చేరిన సీపీఎం డాక్టర్ శ్యాంసన్

గుంటూరు (మెడికల్) ఫిబ్రవరి 1: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగంలో నూతన క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్‌గా (సీపీఎం) డాక్టర్ శ్యాంసన్ గురువారం విధుల్లో చేరారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణాధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులను కలసి ఆయన రిపోర్ట్ చేశారు. అనంతరం గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్యాంసన్ మాట్లాడుతూ జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలు మరింత ఉధృతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం అధికారులు జ్యోతుల వీరాస్వామి, శ్రీనివాస్, శ్రీవిద్య, షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ రత్నకుమార్, సాతి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎంపికైన జట్టుతో వర్సిటీ పరిశీలకులు సూర్యనారాయణ తదితరులు

ముగిసిన వర్సిటీ ఇంటర్-కాలేజియేట్

బేస్ బాల్ టోర్నమెంట్ పోటీలు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 1: స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల నుంచి జరుగుతున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంటర్-కాలేజియేట్ బేస్‌బాల్ (మెన్) టోర్నమెంట్ పోటీలు గురువారం ఘనంగా ముగిసాయి. టోర్నమెంట్‌లో సీఆర్ కళాశాల (చిలకలూరిపేట) జట్టు ప్రథమస్థానం, ఆర్వీఆర్‌జేసీ ద్వితీయస్థానం, ఎమ్ఎల్అండ్ఎస్ డిగ్రీ కాలేజీ తృతీయ, యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్ జట్టు నాల్గొవ స్థానంలో నిలిచాయి. విజేతలుగా నిలిచిన జట్లకు అతిథులు ట్రోఫీలను అందజేశారు. టోర్నమెంట్‌లో ఉత్తమ నైపుణ్యాన్ని కనబరిచిన క్రీడాకారులను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి వచ్చిన సెలెక్టర్లు, అబ్జర్వర్ ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఆర్గనైజర్ డాక్టర్ పీ.గౌరీశంకర్, ఏఎన్‌యూ నుంచి అబ్జర్వర్‌గా డాక్టర్ డీ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు మహోత్సవం

● బాబాకు చద్దర్, గంధం సమర్పించిన బోనబోయిన

గుంటూరు, ఫిబ్రవరి 1: గుంటూరు నగరంలోని కాలేషా మస్తాన్ వలీ బాబా 132వ ఉరుసు మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో ఈ ఉత్సవంలో పాల్గొని బాబాని దర్శించుకుంటున్నారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావులు గురువారం ఉరుసు మహోత్సవంలో పాల్గొని బాబాకు చద్దర్, గంధం సమర్పించారు. బాబా దర్శనం అనంతరం వారు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబాను దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాలేషా మస్తాన్‌వలీ బాబా ఆలయ ధర్మకర్త రావి రామ్మోహన్‌రావు, జనసైనికులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి గుణపాఠం చెబుతాం

● కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఏపీటీఎఫ్ నేతలు



ధర్నాలో మాట్లాడుతున్న బసవలింగారావు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 1: ఉపాధ్యాయ, ఉద్యోగులను ఆర్థికంగా మోసం చేసి, మానసికంగా ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వానికి త్వరలో గుణపాఠం చెపుతామని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శిలు కే.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్‌లు స్పష్టంచేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మునిసిపల్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు కే.బసవలింగారావు మాట్లాడుతూ మునిసిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్‌రూల్స్ రూపొందించి ఉద్యోగోన్నతులు,బదిలీలు నిర్వహించాలని, వారికి పీఎఫ్ ఖాతాలు ప్రారంభించి రుణసౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అర్బన్ మండల విద్యాశాఖాధికారులు, ఉపవిద్యాశాఖాధికారుల పోస్టులు మంజూరు చేయాలని, విస్తరించిన నగర,పట్టణ ప్రాంతాల్లో నూతన పాఠశాలలు నిర్మించాలన్నారు. జిల్లా కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ ఎంతో పోరాడి రద్దుచేయించుకున్న అప్రెంటీషిప్ విధానం డీఎస్సీలో పునరుద్ధరించుతామని చెప్పడం దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్రంలో 50 వేలపైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉంటే ఊరించి కేవలం 6 వేలతో డీఎస్సీ నిర్మిస్తామని చెప్పడం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. ప్లస్2 తరగతులకు బోధనా ఉపాధ్యాయులకు ఇస్తామన్న ఇంక్రిమెంట్ ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. ఏపీ ఎన్జీవో గుంటూరుజిల్లా నేత మూర్తి, నగర అధ్యక్షప్రధాన కార్యదర్శులు సూరి, కల్యాణ్‌లు మాట్లాడుతూ పీఎఫ్, ఏపీజీఎల్ఐ, జీఐఎస్, సరెండర్ లీవ్ ఎన్కేష్‌మెంట్ బిల్లులకే దిక్కులేకపోతే జనవరి 31 నుంచి ప్రారంభమైన ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యోగ విరమణ బెనిఫిట్లు అసలు ఇస్తారో లేదో తెలియడం లేదన్నారు. కార్యక్రమంలో పెన్షనర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీ.నాగరాజు, ఏపీటీఎఫ్ జిల్లాకమిటీ సభ్యులు ఆడిట్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ, కలెక్టరును కలిసిన నూతన ఎస్పీ

రానున్న ఎన్నికలపై ప్రత్యేక దృష్టి

● సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడమే లక్ష్యం

● రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్, మహిళల భద్రతకు ప్రాధాన్యం

● బాధ్యతలు స్వీకరించిన నూతన ఎస్పీ తుషార్ డూడీ

గుంటూరు, ఫిబ్రవరి 1 : రానున్న ఎన్నికలపై ప్రత్యేక దృష్టిసారించి ప్రశాంత పోలింగ్ జరిగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని నూతనంగా జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన డూడీ స్పష్టం చేశారు. తొలుత ఆయన పోలీస్ కార్యాలయంలో ఉన్న వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జిల్లా నూతన ఎస్పీగా ఆరిఫ్ హఫీజ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఐపీఎస్‌గా ఎంపికైన అనంతరం అదనపు ఎస్పీ హోదా నుంచి ఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పించి మొదటిసారిగా గుంటూరు జిల్లాకు ఎస్పీగా నియమించిన సీఎం, డీజీపీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ.. గుంటూరు జిల్లాలో ఎన్నికల విధుల నిర్వహణ ఒక సవాల్ లాంటిది అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను సజావుగా, నిస్పక్షపాతంగా నిర్వహిస్తామన్నారు. ఇందుకు గాను అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పీ తుషార్ స్పష్టం చేశారు. అదేవిధంగా మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. మహిళలకు భరోసా కల్పిస్తామన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ముఖ్యంగా గుంటూరు నగరంతో పాటు పట్టణ కేంద్రాల్లో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అనంతరం ఆయన కలెక్టర్, ఐజీ, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధి కారులను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సుప్రజ, క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు. లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఎఆర్ అదనపు ఎస్పీ కే.కోటేశ్వరరావు, సెబ్ అదనపు ఎస్పీ వేంకటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రత్నస్వామి, ఏఆర్ డీఎస్పీ, శాంతకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఎస్.వెంకట్రావు, మినిస్టీరియల్ సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ప్రద్యుమ్న, పాల్గొన్న కలెక్టర్ తదితరులు

మరమ్మతు పనులు వేగవంతం చేయాలి

● బీఆర్ స్టేడియాన్ని పరిశీలించిన టూరిజం, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి1: బీఆర్ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి, మరమ్మతు పనులను వేగవంతంచేయాలని రాష్ట్ర యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం, సాంస్కృతికశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రద్యుమ్న అధికారులకు సూచించారు. గురువారం స్థానిక బీఆర్ స్టేడియంలో జరుగుతున్న మరమ్మతు పనులను శాప్ ఎండీ ధ్యాన్‌చంద్, కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జేసీ రాజకుమారి, కమిషనర్ కీర్తి చేకూరిలతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియంలోని క్రికెట్ మైదానం, గ్యాలరీ, డ్రెయిన్ పనులను పరిశీలించిన ప్రద్యుమ్న అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీటీసీ కరీం, శాప్‌ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిద్దయ్య, అసిస్టెంట్ ఇంజినీర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన గుంటూరుజిల్లా, మేడికొండూరు (మం), విశదల గ్రామ కాపురస్తుడు అప్పికట్ల సుధాకర్, S/o. వెంకట సుబ్బారావు గారి సూచనలు మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా, దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి నల్లపాడు గ్రామ కాపురస్తురాలు పరిమిశెట్టి సత్యవతి, W/o. లేటు విన్నకోట మాధవరావు గారు విక్రయ దస్తావేజు నెం.9089/2011 యస్.ఆర్.ఓ. నల్లపాడు ద్వారా కొనుగోలు చేసిన ఆస్తిని విక్రయించుటకు బహిరంగ పరచగా నాక్లయింటు కొనుగోలు చేయుటకు సిద్ధపడి కొంత క్రయధనమును చెల్లించియున్నారు. కావున దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు, తనఖాలు, రాకట్టు కోర్టు జప్తులు వగైరాలు ఉన్నయెడల ఈ ప్రకటన తేది నుండి 7 రోజుల లోగా నాకుగానీ, నాక్లయింటుకు గానీ వ్రాతపూర్వకమైన ఆధారాలతో తెలియజేయుగలరు. గడువులోగా షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి ఎటువంటి క్లయిములు రానియెడల నిష్పేచి ఆస్తిగా భావించి నాక్లయింటు సక్రమమైన విక్రయ దస్తావేజును పొందెదరని తదుపరి వచ్చు ఎట్టి క్లయిములు నాక్లయింటు హక్కులను గాని, షెడ్యూలు ఆస్తిని గాని బైండుచేయ జాలవు.

షెడ్యూలు:గుంటూరు డి॥, నల్లపాడు సబ్.డి॥ యిలాక నల్లపాడు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన నల్లపాడు గ్రామ తాలూకు డి.నెం.554రు యి.6-40 సెంట్లు మింజుమలె చ.గ.445లు స్థలమును ప్లాట్లుగా విభజించినట్టి ప్లాట్లలో చ.గ.62-5లు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు:తూర్పు: దోరడ్ల నాగేశ్వరరావు గారి స్థలము హద్దు, అ.21-6లు, దక్షిణం: నల్లపాటి వెంకట్రావు వగైరాల భూమి హద్దు, అ.30లు, పడమర:అ.6లు వెడల్పు గల రోడ్డు హద్దు,అ.16లు,ఉత్తరం:అ.18లు వెడల్పు గల రోడ్డు హద్దు,అ.30లు.

ఆర్.యస్. వంశీకృష్ణ, న్యాయవాది
2/1 అరండల్‌పేట, గుంటూరు, సెల్: 9440633091

మద్యం.. పెనుభూతం

గుంటూరు, ఫిబ్రవరి 1: మద్యపాన సేవనం మనపాలిట ఓ పెనుభూతమని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. అరండల్‌పేట లోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాగుడు అలవాటును దూరంలో ఉంచగలిగితేనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. మద్యం తాగేవారు ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతుండటం అత్యంత ఆందోళనకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో రామ్‌కుమార్, సుజాత, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి నో.. వెంకటేశ్ ఎస్ ?




ఇండస్ట్రీలో ఒక హీరో నో చెప్పిన చిత్రాలకు మరో హీరో ఎస్ చెప్పడం పరిపాటే. తాజాగా టాలీవుడ్‌లోనూ అలాంటి సంఘటనే చోటు చేసుకుందని ఇండస్ట్రీ టాక్. దిల్ రాజు నిర్మాతగా దర్శకుడు అనిల్ రావిపూడి చిరంజీవి కోసం ఓ కథను సిద్ధం చేశారనే మాట కొన్నాళ్లుగా పరిశ్రమలో వినిపిస్తోంది. ప్రాజెక్ట్ కూడా దాదాపు ఓకే అయినట్లేనని భావించారు. కానీ ఆ కథ చిరంజీవిని మెప్పించలేకపోయిందనే మాట ప్రస్తుతం వినిపిస్తోంది. దాంతో వెంకటేశ్ దగ్గరకు వెళ్లిన అనిల్ రావిపూడి అదే కథను ఓకే చేయించుకున్నారనీ, త్వరలోనే అధికారిక ప్రకటన రావొచ్చని సమాచారం. అయితే ఇంతకీ ఆ కథలో చిరంజీవికి ఏం నచ్చలేదు, వెంకటేశ్‌కు ఏం నచ్చి ఓకే చేశారు అనేది ఆ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చి ప్రేక్షకుల ముందుకు వచ్చేవరకూ మిస్టరీగానే మిగిలిపోతుంది.

కొత్త ప్రపంచంలోకి వెళతారు



గీతానంద్

'ఇదొక యూనిక్ స్టోరీ. రెగ్యులర్‌గా కాకుండా కొత్తగా చూపించాలని ప్రయత్నించాం. లూజర్ నుంచి విన్నర్‌గా హీరో ఎలా మారాడు అనేది ఆసక్తికరంగా ఉంటుంది' అన్నారు గీతానంద్. ఆయన హీరోగా నటించిన 'గేమ్ ఆన్' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా గీతానంద్ మీడియాతో మాట్లాడుతూ' మా తమ్ముడు దయానంద్ డైరెక్టర్ కావడంతో స్ర్కిప్ట్ విషయంలో ఇద్దరం బాగా చర్చించుకున్నాం. ఇద్దరం కలసి ఇంతకుముందు షార్ట్ ఫిల్మ్ చేశాం. ఈ సినిమా విషయంలో ఆ అనుభవం మాకు హెల్ప్ అయింది. నిర్మాత రవి కస్తూరి కూడా నాకు ఫ్రెండ్ కావడంతో ముగ్గురం కలసి చర్చించుకుని నిర్ణయాలు తీసుకొనేవాళ్లం. రియల్ టైమ్ సైకలాజికల్‌గా సాగే ఈ సినిమాతో ప్రేక్షకులు కొత్త గేమ్ వరల్డ్‌లోకి వెళ్లిపోతారు' అని చెప్పారు. సీక్వెల్ కోసం వేరే ప్లానింగ్ ఉందనీ, ఈ సినిమాకు వచ్చే రియాక్షన్ బట్టి దాన్ని ప్రకటిస్తామని తెలిపారు.



సుహాస్ హీరోగా దుష్యంత్ కటికినేని దర్శకత్వం వహించిన 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో హీరో విజయ్ దేవరకొండ ఈ చిత్రం బిగ్‌టికెట్‌ను రిలీజ్ చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

పన్నెండు గుంజల పందిరి కింద



చైతన్యరావు, భూమిశెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమారస్వామి దర్శకత్వంలో నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రం నుంచి 'పన్నెండు గుంజల పందిరి కింద' అంటూ సాగే గీతాన్ని దర్శకుడు శేఖర్ కమ్ముల చేతులు మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ పాట చూస్తుంటే తెలంగాణ మట్టి వాసన కనిపిస్తోంది. పెద్దింటి అశోక్ కుమార్ సాహిత్యం, సురేశ్ బొబ్బిలి సంగీతం ఆకట్టుకున్నాయి. ఇకపై ప్రతిపెళ్లిలో ఈ పాట వినిపిస్తుంది' అన్నారు. మా సినిమాకు ఈ పాట ప్రత్యేకాకర్షణ అవుతుందని దర్శకుడు తెలిపారు.

ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో...



'బిగ్‌బాస్' అమర్‌దీప్ హీరోగా, నటి సురేఖా వాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా నటించే చిత్రం షూటింగ్ గురువారం ప్రారంభమైంది. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన తొలి షాట్‌కు నిర్మాత ఎ.ఎం.రత్నం కెమెరా స్విచ్ ఆన్ చేయగా, బసిరెడ్డి క్లాప్ ఇచ్చారు. వీరశంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ 'భారతీయ సినిమా చరిత్రలో ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో ఈ సినిమా తీస్తున్నాం' అని చెప్పారు. 'బిగ్‌బాస్' హౌస్‌లోకి వెళ్లకముందే ఈ సినిమాకు సైన్ చేసినట్లు హీరో అమర్‌దీప్ చెప్పారు. నటి సురేఖా వాణి మాట్లాడుతూ 'ఈ ప్రాజెక్ట్ విన్న తర్వాత వీళ్లు చేస్తారా లేదా అనే అనుమానం వచ్చింది. దర్శకనిర్మాతల మీద నమ్మకంతోనే నా బిడ్డను వాళ్ల చేతులో పెట్టా' అన్నారు. ఈ చిత్రానికి మాటలు: మరుధూరి రాజా, ఫొటోగ్రఫీ: బాల సరస్వతి.

విశ్వంభర కోసం సన్నద్ధం



చిరంజీవి కథానాయకుడిగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'విశ్వంభర'. రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుండడంతో చిత్రీకరణలో పాల్గొనేందుకు చిరంజీవి సన్నద్ధమవుతున్నారు. సరికొత్త లుక్‌లో కనిపించేందుకు జిమ్‌లో కసరత్తు మొదలుపెట్టారు. దీనికి సంబంధించిన వీడియోను గురువారం ఆయన సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. 'విశ్వంభర' కోసం సిద్ధమవుతున్నానని ఆ వీడియోలో చిరంజీవి తెలిపారు. యువీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ భారీస్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎం. ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఛోటా కే నాయుడు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



స్వామి వారికి పులిహోర నివేదిస్తున్న బాలస్వామి

శ్రీనివాసుడికి 450 కిలోల అన్నకూటోత్సవం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 1: శ్రీవేంకటేశ్వర సప్తాహ వైభవోత్సవాలలో శ్రీనివాసునికి 450 కిలోల పురహోరతో గురువారం అన్నకూటోత్సవం నిర్వహించారు. తాలూకా జూనియర్ కళాశాలలో జరుగుతున్న వైభవోత్సవాలలో తిరుమల తరహా సేవలను నిత్యం నిర్వహిస్తున్నారు. సుప్రభాతం, తోమాల సేవ, అర్చన, హారతి కార్యక్రమాలు జరిపారు. యాగశాలలో హోమాలు నిర్వహించారు. ఉదయం స్వామికి తిరుప్పాడ వడ సేవ, సాయంత్రం పూలంగి సేవలు నిర్వహించారు. టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో మహిళా భక్తులు 2 వేల మంది అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. స్వామివారిని బద్రీనారాయణ రూపంలో అలంకరించారు. సాలిగ్రామ పీఠం ట్రస్ట్ చైర్మన్ నంబూరి కృష్ణమూర్తి, కార్యదర్శి నాగేశ్వరరావు, ముద్దాభక్తుని రమణయ్య, కుమార్ పంప్స్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, చిదంబర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. బాలస్వామి ఆధ్వర్యంలో సేవలు నిర్వహించారు. సంపూర్ణ ఆనందగిరి స్వామి, శ్రీనివాసుని విశిష్టతను, రామాయణ విశిష్టతను వివరించారు.



నిరసన ప్రదర్శన చేస్తున్న యువకులు

నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

● రెవల్యూషనరీ యూత్ అసోసియేషన్ నేతల ఆందోళన

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 1 : ఉద్యోగాలు భర్తీ విషయంలో నిరుద్యోగులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని రెవల్యూషనరీ యూత్ అసోసియేషన్ సభ్యుడు ఉదయ్‌కిరణ్ విమర్శించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా గురువారం పట్టణంలోని గాంధీచౌక్‌వద్ద ఆందోళన చేపట్టారు. రాష్ట్రంలో 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా కేవలం 6 వేల పోస్టులు మాత్రమే భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వడం ప్రభుత్వ దివాలా కోరుతనానికి నిదర్శనమన్నారు. వెంటనే అన్ని పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైల్వే సంస్థలో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉండగా కేవలం ఆరు వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేశారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలు మార్చుకోకుంటే రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. వంశీ, ప్రవీణ్, ప్రదీప్, ఉదయ్, జయవెంకటేష్, బాషా పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి

● ఇంటింటి ప్రచారంలో టీడీపీ నేతలు

తెనాలి రూరల్, జనవరి 1: రాష్ట్రంలో నిజమైన అభివృద్ధి, సంక్షేమం టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుతోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో ఆయనను తిరిగి అధికారంలోకి తీసుకు వద్దామని తెనాలి మండల తెలుగు మహిళా కార్యదర్శి ఏ.అనిత అన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ కల్పిస్తూ చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మిని మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను పార్టీ శ్రేణులతో కలిసి అనిత గురువారం మండలంలోని ఖాజీపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత బస్సు పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం, సంవత్సరానికి మూడు గ్యాస్‌సిలిండర్లు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన స్త్రీలందరికీ నెలకు రూ.1500, తల్లికి వందనం వంటి పలు పథకాలను ప్రజలకు వివరించారు. ఈమేరకు చంద్రబాబు సంతకం చేసిన బాబు ష్యూరిటీ బాండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు మునలయ్య, పలువురు గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



యేసుపాదంను సన్మానిస్తున్న పాస్టరు

ఘనంగా రక్షణ సైన్యం వార్షికోత్సవం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 1 : ఐతానగర్‌లోని రక్షణ సైన్యం వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. మేనేజర్ యేసుపాదం, ప్రశాంతకుమారిలను ఘనంగా సన్మానించారు. రత్నసుందరి, నాగరాజు, జక్రయ్య, రవి వాక్య సందేశం ఇచ్చారు. గృహ సమితి యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు. 2 వేల మందికి అన్నదానం చేశారు.

డాక్టర్ రాజేంద్రప్రసాద్‌కి గోల్డ్ మెడల్

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 01: డాక్టర్ చదలవాడ కృష్ణయ్య స్మారక గోల్డ్‌మెడల్‌ను డాక్టర్ రాజేంద్రప్రసాద్‌కి అందజేశారు. స్థానిక బోసురోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలిబ్రాంచిలో గురువారం డాక్టర్ చదలవాడ కృష్ణయ్యచౌదరి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అయన చిత్ర పటానికి ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి, కోశాధికారి డాక్టర్ కే.శ్యాంప్రసాద్, పవని ప్రియాంకలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. డాక్టర్ చదలవాడ కృష్ణయ్య స్మారక గోల్డ్ మెడల్‌ను ఈ సంవత్సరం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చెవిటివారికి ప్రత్యేక పద్ధతుల ద్వారా చికిత్సలను అందిస్తున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్‌కి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొచ్చర్ ఈంప్లాంట్స్, సీఎంఈ ద్వారా చెవిటి వారికి ఎటువంటి చికిత్సలను అందించు విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు దక్షిణామూర్తి, మస్తానమ్మ, సాంబశివుడు, అబ్బయ్య, సాంబశివరావు, సందీప్, చదలవాడ కృష్ణయ్యచౌదరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, గాదె వెంకటేశ్వరరవు

టీడీపీ, జనసేన కూటమిదే విజయం

● జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన వెల్లడి

గుంటూరు, ఫిబ్రవరి 1: రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిదే విజయమని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ దీమా వ్యక్తంచేశారు. అమరావతి రోడ్డులోని జనసేన పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పశ్చిమ నియోజకవర్గంలో రేపటి నుంచి 'జనంతో జనసేన' అనే కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు బోనబోయిన తెలిపారు. వైసీపీ ప్రభుత్వం దోచుకో.. దాచుకో అనే పద్ధతిలో వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. జగన్ రెడ్డి ఎన్నికలకు సిద్దమా? అని ఫ్లెక్సీలు వేస్తున్నాడని, కానీ టీడీపీ, జనసేన కూటమి రెండేళ కిందటే ఎన్నికలకు సిద్ధంగా ఉన్న విషయాన్ని జగన్ రెడ్డి గుర్తించుకోవాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా టీడీపీ, జనసేన కూటమిదే విజయమన్నారు. జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల సొమ్ము కాజేసి సోకులు చేసుకుంటున్న వైసీపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. అనంతరం 'జనం కోసం జనసేన' కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జనసేన అర్బన్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల సురేష్, మహిళా వింగ్ రీజనల్ కోఆర్డినేటర్ పార్వతి నాయుడు, అడపా మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం ఇ(ఎ)లా ?

● రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం
● గుంతలమయంగా మారిన రోడ్లు
● రోడ్లు వేయించాలని వాహనదారుల విజ్ఞప్తి



పెదరావూరు రోడ్డుపై ప్రయాణం ఇలా ..



సంగంజాగర్లమూడి గరువుపాలెం వద్ద ఇలా ..

తెనాలిరూరల్, ఫిబ్రవరి 1: తెనాలి నుంచి పలుప్రాంతాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారి ఆ రోడ్లపై ప్రయాణం వాహనదారులకు ఇటు ప్రయాణీకులకు నరకప్రాయంగా మారింది. తెనాలి నుంచి వయా సంగంజాగర్లమూడి మీదుగా నారాకోడూరు వెళ్లే మార్గం, తెనాలి నుండి నందివెలుగు, కొలకలూరు, హాఫ్‌పేట, కాజీపేట మీదుగా గుంటూరు వెళ్లే రోడ్డుమార్గం, తెనాలి మీదుగా పెదరావూరు, కూచిపూడి వెళ్లే రోడ్డుమార్గం, తెనాలి నుండి దుగ్గిరాల మీదుగా మంగళగిరి వెళ్లే రోడ్డుమార్గంతో పాటు తెనాలి నుండి బుర్రిపాలెం వెళ్లే రోడ్డు సైతం దెబ్బతిని గుంతలయంగా మారడంతో ఆ రోడ్లపై ప్రయాణం చేసే వాహనదారులు ప్రమాదాలబారిన పడుతూ క్షతగాత్రులుగా మారుతున్నారు. ఇందుకు ప్రధానంగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రోడ్ల ఆలనా పాలనా పట్టించుకోకపోవడంతో రోజురోజుకు రోడ్లనాణ్యతలు దెబ్బతిని వాటికి వాడిని కంకరరాళ్లు, తారు, ఇతర మెటీరీయల్ విడిపోయి గుంతలమయంగా మారాయి. నాలుగేళ్లలో కురిసిన వర్షాలకు, అధికలోడ్‌తో వెళ్లే వాహనాలతో ఆ గుంతలు కాస్తా పెరుగుతూ డొంక రోడ్లను తలపిస్తూ ప్రయాణం ప్రమాదరకంగా మారింది. ఆ రోడ్లపై ప్రయాణించే వాహనదారులకు నడుం నొప్పులు, ఇతరత్రా అనారోగ్య సమస్యల బారిన పడుతున్నామని, అంతే కాక వాహనాలు కూడా టైర్లు దెబ్బతినడం, ఇతర మరమ్మత్తులకు గురిఅవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తెనాలిలో పేరుగాంచిన జిల్లా ప్రభుత్వవైద్యశాల అత్యవసర విభాగానికి వైద్యసేవలకు సైతం ప్రతిరోజు అనేకమందిని 108 అంబులెన్సుల ద్వారా వివిధ ప్రాంతాల నుంచి తీసుకు వస్తుంటారు. భారీ గుంతలతో అధ్వానంగా వున్న ఆరోడ్లపై వచ్చేక్రమంలో రోగులకు నరకం కనిపిస్తుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందిం చి రోడ్డు ప్రయాణం సురక్షితంగా జరిగేలా నూతన రోడ్లు నిర్మించాలని సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కొలకలూరు రోడ్డు ఇలా ..



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

దాతల సహకారం అభినందనీయం

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 01: పట్టణంలో పేదప్రజల కోసం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లకు దాతల సహకారం అభినందనీయమని టీడీపీ నేత, క్యాంటీన్ నిర్వాహక సభ్యుడు కొత్తపల్లి రమేష్ అన్నారు. స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో గురువారం కన్నెగంటి వేణుప్రసాద్ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు శివకుమారి, ఆంజనేయులు, కుటుంబసభ్యుల సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. శివాజిచౌక్‌లో అన్నక్యాంటీన్‌లో ఆలపాటి రాజా దంపతుల సహకారంతో ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, ముళ్ళపూడి వెంకట్, మాదల కోటేశ్వరరావు, వెనిగళ్ళ శివప్రసాద్, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, గుమ్మడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

కొల్లిపర, ఫిబ్రవరి 1: కొల్లిపర మండల తహసీల్దార్ నాంచారయ్య తిరుపతి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈమేరకు గురువారం మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది తహసీల్దార్ నాంచారయ్యను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాంచారయ్య మాట్లాడుతూ కొల్లిపర మండల తహసీల్దార్‌గా తాను బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు రెవెన్యూ అధికారులు పూర్తి సహకారం అందించినట్లు తెలిపారు. ఏఎస్‌వో మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నాంచారయ్య అంకితభావంతో పనిచేశారన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ జేవీఎస్ ఎన్.మూర్తి, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

కొల్లిపర, ఫిబ్రవరి 1 : కొల్లిపర మండలం ఎంపీడీవోగా వై. విష్ణుప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణాజిల్లా రెడ్డిగూడెం మండలంలో పనిచేస్తున్న విష్ణుప్రసాద్ కొల్లిపరకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు కొల్లిపర ఎంపీడీవోగా కొనసాగిన విజయలక్ష్మి ప్రకాశంజిల్లా రేచర్ల మండలం బదిలీపై వెళ్ళారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో విష్ణుప్రసాద్ మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి చేయటంలో తనవంతు కృషి చేస్తానన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఏఈ కే.రవిశంకర్, ఏవో చంద్రమోహన్, ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ వెంకటేశ్వర్లు సేవలు ప్రశంసనీయం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 01: చట్టాన్ని పరిరక్షిస్తూ తెనాలి మండలంలో నేరనియంత్రణకు ఎస్ఐ వెంకటేశ్వర్లు చేసిన కృషి అభినందనీయమని ఏపీయూడబ్ల్యూజే నేతలు తులిసానేజ తెనాలి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు బదిలీపై వెలుతున్న సందర్భంగా పట్టణంలోని సీపీఐ కార్యలయంలో గురువారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఎస్ఐగా వెంకటేశ్వర్లు తెనాలి మండలంలో చేసిన సేవలను కొనియాడారు. సీనియర్ జర్నలిస్ట్ బొల్లిముంత కృష్ణ, మార్కండేయులు, కె.సునీల్ సందీప్, కె.రమేష్‌కుమార్, సత్యనారాయణ(సత్య),బాబీ, బి.రామకృష్ణారెడ్డి, బి. సుధాకర్, కమలాకర్, నరసింహ పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 01: ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం పట్టనంలోని చెంచుపేటలో సెబ్ పోలీసులు ప్రధాన రహదారిపై విధులో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని గుర్తించి, సీజ్‌చేసి త్రీటౌన్ స్టేషన్‌కి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

విధుల్లో చేరిన నూతన సీఐలు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి1 : బదిలీల్లో భాగంగా పొన్నూరు అర్బన్, రూరల్ సీఐలుగా వచ్చిన అధికారులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అర్బన్ సీఐగా భాస్కర్, గుంటూరు రేంజ్ వీఆర్ నుంచి పొన్నూరు బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేసిన అల్తాఫ్ హుస్సేన్ ఇటీవలే నెలూరు బదిలిపై వెళ్లారు. అలాగే రూరల్ సీఐగా వై.కోటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. రూరల్ సర్కిల్‌లో పని చేసిన మీసాల రాంబాబు సత్తెన్నపల్లి బదిలిపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన అధికారులకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

పొన్నూరు ఎంపీడీవోగా రత్నజ్యోతి

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి1: పొన్నూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా పీ.రత్న జ్యోతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. రత్నజ్యోతి ప్రకాశం జిల్లా టంగుటూరు నుంచి పొన్నూరుకు బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ఏ. శ్రీనివాసరావు బదిలీపై కృష్ణజిల్లాకు వెళ్లారు.

కాపు నేతలపై దాడులు అప్రజాస్వామికం

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి1: రాష్ట్రంలో కాపు నేతలు, జర్నలిస్టులపై దాడులు అక్రమ కేసులు పెరిగిపోయాయని జిల్లా కాపు జాగృతి అధ్యక్షురాలు సమ్మెల రజిని గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణపై తొండేది గ్రామంలో జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. కాపు కుటుంబ పెద్ద అయ్యిన కన్నా లక్ష్మీ నారాయణపై దాడి సహేతికం కాదన్నారు. కాపులపై జరుగుతున్న దాడుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రజిని కోరారు.

మిరాకిల్ వరల్డ్‌రికార్డ్స్ సభ్యుడిగా రత్నాకర్


తెనాలిఅర్బన్, ఫిబ్రవరి1: మిరాకిల్ వరల్డ్‌రికార్డ్స్ జ్యూరీ సభ్యుడిగా తెనాలికిచెందిన కళాకారుడు కనపర్తి రత్నాకర్ నియమితులయ్యారు. సాంస్కృతిక, కళా రంగాల్లో ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఆ సంస్థ ఈ పదవికి రత్నాకర్‌ను ఎంపిక చేస్తూ సంస్థ కో-ఆర్డినేటర్ పి.రవీంద్ర నియామకపత్రం జారీచేశారని తెలిపారు.ఈ సందర్భంగా సాహిత్యవేత్తలు, కళాకారులు రత్నాకర్‌ను అభినందించారు.

అంతర్జాతీయ పత్రికలో

తెలుగు సౌరభం పద్యాలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 1 : అంతర్జాతీయ పత్రికలో తెనాలి కవి నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి తెలుగు సౌరభం పద్యాలు ప్రచురణకు నోచుకున్నాయి. అమెరికాలో తెలుగు వారితో నడుస్తున్న తెలుగు జ్యోతి పత్రికలో సంక్రాంతి పురస్కరించుకుని నిర్వహించిన సంక్రాంతి పోటీల్లో కొలకలూరు సాహితీరత్న ప్రజ్ఞాచారి పద్యాలు పంపారు. సాహితీ ప్రక్రియలో వస్తువు, శిల్పం సమాన స్థాయిలో ఉన్నప్పుడు ఆ కవిత్వానికి ఖండాలు దాటే శక్తి ఉంటుందన్నారు. ప్రజ్ఞాచారిని పలువురు కళాకారులు, సాహిత్యవేత్తలు అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తెనాలి క్రైం, ఫిబ్రవరి 1 : తెనాలి రైల్వే స్టేషన్ 1వ నెంబరు ప్లాట్ ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండగా గుర్తించినట్లు రైల్వే పోలీసులు గురువారం తెలిపారు. షుమారు 50-55 సంవత్సరాల వ్యక్తి రైల్వే స్టేషనులోని 1వ నెంబరు ప్లాట్‌ఫారంపై మధ్యాహ్న సమయంలో ఆకస్మాత్తుగా కుప్ప కూలిపోవడంతో స్థానికప్రయాణికులు ఇచ్చిన సమాచారం మేరకు వెళ్ళి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి వ్యక్తిగత సమాచారం లభించకపోవడంతో మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు పోస్టు మార్టంనిమిత్తం తరలించినట్లు రైల్వేపోలీసులు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగులు

సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 1 : ఉద్యోగ విరమణ చేసిన వారు సామాజిక సేవల్లో ముందుండాలని టు టౌన్ సీఐ అద్దంకి సుధాకర్ తెఇపారు. ఏఎస్ఐగా ఉద్యోగ విరమణ చేసిన వాకా రామకోటేశ్వరరావును గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 40 ఏళ్లపాటు పోలీసుశాఖలో పని చేసి మంచి పేరు తెచ్చుకున్నారని అభినందించారు. రాజీ పడకుండా విధి నిర్వహణ చేశారని, జూనియర్లకు సలహాలు ఇస్తూ దిశా నిర్దేశం చేశారని అభినందించారు. త్రీ టౌన్ సీఐ రమేష్, ఎస్ఐలు వెంకటేశ్వరరావు, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

15 మంది ఏఎన్ఎంల సస్పెన్షనే

● రక్తహీనత నివారణ చర్యల్లో విఫలమైనందుకు వేటు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 1: గర్భిణులు, ఎదిగిన బాలికల్లో ఎక్కువగా కనిపించే రక్త హీనత నివారణ చర్యల్లో విఫలమైనందుకు ఏఎన్ఎంల (యాక్సలరినర్సింగ్ ఫర్ మిడ్ వైఫరీ)పై వైద్య ఆరోగ్య శాఖ కొరడా ఝళిపించింది. రాష్ట్ర వ్యాప్తంగా 15 మంది ఏఎన్ఎంలను సస్పెండ్ చేయాలని వైద్యఆరోగ్య శాఖ కమిషనర్ నివాస్ గురువారం జిల్లా అధికారులను ఆదేశించారు. ఏఎన్ఎం ఏపీ హెల్త్ యాప్‌లో ఆరోగ్య కార్యకర్తలు గర్భిణులు, ఎదిగిన బాలికల హిమోగ్లోబిన్(రక్త శాతం) నమోదు చేస్తున్నారు. రాష్ట్రంలోని 15 సచివాలయాల పరిధిలోని గర్భిణులు, ఎదిగిన బాలికలు చాలా తక్కువ రక్త శాతం కలిగి ఉన్నట్లు కమిషనరేట్ అధికారులు గుర్తించారు. చాలా తక్కువ శాతం రక్తం కలిగిఉన్న గర్భిణులు, ఎదిగిన బాలికలు ఉన్నప్పటికీ నివారణ చర్యలు చేపట్టడంలో సచివాలయ ఏఎన్ఎంలు విఫలమైనట్లు అధికారులు గుర్తించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 15 ఏఎన్ఎంలను వెంటనే సస్పెండ్ చేయాలని కమిషనర్ ఆయా జిల్లాల అధికారులను ఆదేశించారు. సస్పెండ్ అయిన వారిలో అనకాపల్లి జిల్లా ఏటికొప్పాక, అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రం-5, చిత్తూరు జిల్లా కొంగనపల్లె, ఏలూరు జిల్లా ఉంగుటూరు, రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం, బుట్టాయిగూడెం-2, పెడనలి, నంద్యాల జిల్లా ముత్యాలంపాడు, పల్నాడు జిల్లా అచ్చంపేట-2, ఉప్పలపాడు, పార్వతీపురం మన్యం జిల్లా గాంధీనగర్, తిరుపతి జిల్లా బీటీఆర్ కాలనీ, వైస్సార్ జిల్లా గానుగపెంట సచివాలయాల ఏఎన్ఎంలు ఉన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు వారి సస్పెన్షన్ కొనసాగించాలన్నారు.




బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ, కలెక్టరును కలిసిన నూతన ఎస్పీ

రానున్న ఎన్నికలపై ప్రత్యేక దృష్టి

● సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడమే లక్ష్యం
● రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్, మహిళల భద్రతకు ప్రాధాన్యం
● బాధ్యతలు స్వీకరించిన నూతన ఎస్పీ తుషార్ డూడీ

గుంటూరు, ఫిబ్రవరి 1 : రానున్న ఎన్నికలపై ప్రత్యేక దృష్టిసారించి ప్రశాంత పోలింగ్ జరిగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని నూతనంగా జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన డూడీ స్పష్టం చేశారు. తొలుత ఆయన పోలీస్ కార్యాలయంలో ఉన్న వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జిల్లా నూతన ఎస్పీగా ఆరిఫ్ హఫీజ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఐపీఎస్‌గా ఎంపికైన అనంతరం అదనపు ఎస్పీ హోదా నుంచి ఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పించి మొదటిసారిగా గుంటూరు జిల్లాకు ఎస్పీగా నియమించిన సీఎం, డీజీపీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ.. గుంటూరు జిల్లాలో ఎన్నికల విధుల నిర్వహణ ఒక సవాల్ లాంటిది అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను సజావుగా, నిస్పక్షపాతంగా నిర్వహిస్తామన్నారు. ఇందుకు గాను అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పీ తుషార్ స్పష్టం చేశారు. అదేవిధంగా మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. మహిళలకు భరోసా కల్పిస్తామన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ముఖ్యంగా గుంటూరు నగరంతో పాటు పట్టణ కేంద్రాల్లో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అనంతరం ఆయన కలెక్టర్, ఐజీ, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధి కారులను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. కార్యక్రమంలో అడిష నల్ ఎస్పీ సుప్రజ, క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు. లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఎఆర్ అదనపు ఎస్పీ కే.కోటేశ్వరరావు, సెబ్ అదనపు ఎస్పీ వేంకటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రత్నస్వామి, ఏఆర్ డీఎస్పీ, శాంతకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఎస్.వెంకట్రావు, మినిస్టీరియల్ సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రఖార్‌జైన్


పారదర్శకంగా ఓటర్ల జాబితా

●రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్

తెనాలి రూరల్, జనవరి 1: ఓటర్ల జాబితా పూర్తి పారదర్శకంగా తయారు చేస్తామని అందుకు అధికారులకు వివిధ పార్టీల నాయకులందరూ సహకరించాలని సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్ చెప్పారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గురువారం సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్ అధ్యక్షతన పొలిటికల్ పార్టీలతో ఓటర్ల జాబితాపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు ఓటర్ల జాబితాలో ఇప్పటికీ పలు ప్రాంతాల్లో చనిపోయిన వారిని తొలగించలేదని, గ్రామాల్లో ఉండే వారు పట్టణ పరిధిలో ఓటర్లుగా నమోదు చేసుకున్న వారు లేకపోలేదని వాటన్నింటిపై దృష్టిపెట్టి ఓటర్లజాబితా పూర్తి పారదర్శకంగా ఉండేలా చూడాలని కోరారు. తహసీల్దార్ రవిబాబు మండలంలోని ఓటర్ల వివరాలను పొలిటికల్ శ్రేణులకు వివరించారు. అభ్యంతరాలుంటే వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కరించడం జరుగుతుందన్నారు. మునిసిపల్ కమిషనర్ శేషన్న, టీడీపీ, జనసేన, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

లే అవుట్‌లలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయండి

పేదలందరికీ ఇల్లు పథకంద్వారా జగనన్నకాలనీలో స్థలాలు పొందిన లబ్ధిదారులకు స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో సచివాలయాలపరిధిలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఆయనవెంట తహసీల్దార్ రవిబాబు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



డాక్టర్ ఠాగూర్‌కు నివాళులు అర్పిస్తున్న వైద్యులు, పట్టణ ప్రముఖులు

డాక్టర్ ఠాగూర్ సేవలు మరువలేనివి

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి1: పొన్నూరు పట్టణ, పరిసర ప్రాంతాలో పేదలకు వైద్యం డాక్టర్ నల్లమోతు రవీంద్రనాధ్ ఠాగూర్ సేవలు మరువలేదని ఏఎంసి చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు అన్నారు. రవి కార్డియార్టి, డయాబెటిక్ కేర్ సెంటర్‌లో గురువారం డాక్టర్ ఠాగూర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఠాగూర్ చిత్రపట్టానికి పూలమాలలు వేసి నివాళ్ల అర్పించారు. ఈ సందర్భంగా హైపర్ టెన్షన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లమోతు కిరీటి రతన్ మాట్లాడుతూ హైపర్ టెన్షన్ సైలెంట్ కిలర్ అని, 40 ఏళ్ల దాటిన ప్రతి వ్యక్తి బీపీ పరీక్ష చేయించుకుంటూ ఉండాలని సూచించారు. అధిక రక్త పోటు వల్లన కలిగే ఇబ్బంధులను వివరించారు. ప్రతి వ్యక్తి వారానికి 150 నిమిషాలు వ్యాయామం చేయటం ద్వారా ఆరోగ్యకరమైన జీవనం గడపవచ్చని సూచించారు. అనంతరం పొన్నూరు ప్రాంతంలో డాక్టర్ రవింద్రనాధ్ ఠాగూర్ చేసిన వైద్య సేవల గురించి మననం చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ నల్లమోతు రూత్ రాణి, ఎల్ పిచ్చి రెడ్డి, వడ్రాణం ప్రసాదరావు, బోయిన శివ నాగరాజు, షేక్ షఫైతుల్లా, గేరా సుబ్బయ్య, రగురామ్ విద్యాసాగర్, షేక్ సుల్తాన్, షేక్ నాజర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వర్సిటీ ఇంటర్-కాలేజియేట్

బేస్ బాల్ టోర్నమెంట్ పోటీలు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 1: స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల నుంచి జరుగుతున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంటర్-కాలేజియేట్ బేస్‌బాల్ (మెన్) టోర్న మెంట్ పోటీలు గురువారం ఘనంగా ముగిసాయి. టోర్నమెంట్‌లో సీఆర్ కళాశాల (చిలకలూరిపేట) జట్టు ప్రథమస్థానం, ఆర్వీఆర్‌జేసీ ద్వితీయ స్థానం, ఎమ్ఎల్ అండ్ ఎస్ డిగ్రీ కాలేజీ తృతీయ, యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్ జట్టు నాల్గొవ స్థానంలో నిలిచాయి. విజేతలుగా నిలిచిన జట్లకు అతిథులు ట్రోఫీలను అందజేశారు. టోర్నమెంట్‌లో ఉత్తమ నైపుణ్యాన్ని కనబరిచిన క్రీడాకారులను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి వచ్చిన సెలెక్టర్లు, అబ్జర్వర్ ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఆర్గనైజర్ డాక్టర్ పీ.గౌరీశంకర్, ఏఎన్‌యూ నుంచి అబ్జర్వర్‌గా డాక్టర్ డీ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.